


# నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

అనంతపురం
శ్రీ సత్యసాయి


సోమవారం, 05 మే 2025

పేజీలు 11


## సక్సెస్‌కు షార్ట్ కట్ దేనికి సంకేతం..

కారుణ్య... మీ వ్యవహారం బట్టబయలైంది. విద్యా వ్యవస్థలో చేయకూడని తప్పిదం మీరు చేశారు. ఇక మీ ఆగడాలు సాగవు. మీతోపాటు అంటగాగిన కళాశాల కూడా మూతపడక తప్పదు. పూర్తి ఆధారాలు విత్ ఆడియో అండ్ వీడియో ప్రూఫ్స్‌తో **"నేటి దినపత్రిక సూర్య"** పాఠకుల ముందుకు తీసుకు రాబోతోంది.



## ఎడ్యుకేషన్ క్రైమ్‌లో..

# వికసించిన కారుణ్యం..!

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన అయ్యవారులే దొడ్డిదారి చూపుతున్నారు...

కారుణ్య ఆగడాలు.. అంటగాగుతున్న కళాశాల వ్యవహారాలు...

ఆధారాలతో నిరూపిస్తాం. చర్యలకు ఆర్ఐఓ సిద్ధమా..?

తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించాలన్న తల్లిదండ్రుల కలలే ఈ అకాడమీకి కాసుల వర్షం కురిపిస్తున్నాయి. మీ విద్యార్థులకు ఐఐటి, నీట్, ఎంసెట్లో అత్యుత్తమ మార్కులు వచ్చే విధంగా కోచింగ్ ఇస్తామని లక్షలాది రూపాయలు కాజేస్తున్నాయి. అనంతపురం ఆదిమూర్తి నగర్‌లోని కారుణ్య అకాడమీ ఎడ్యుకేషన్ క్రైమ్‌లో వికసిస్తోంది. గుణాత్మక విద్యాబుద్ధులు నేర్పాల్సిన అయ్యవారే ఎంతో కీలక దశ అయిన ఇంటర్మీడియట్ లోనే దొడ్డి దారిన ఎలా పైకి రావాలో పైకం తీసుకుని మరి నేర్పిస్తున్నారు. అవును ఇది ముమ్మాటికీ వాస్తవం. "మేజర్ న్యూస్" రాస్తున్నది అక్షరసత్యం. ఐఐటి, నీట్, జేఈఈ మెయిన్స్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలలో సక్సెస్ అయ్యేందుకు షార్ట్ కట్ లు చూపుతున్నారు. కారుణ్య అకాడమీ ఏర్పడినప్పటి నుండి ఆ కళాశాలతో అంటకాగుతూ... ఇంతకాలం తల్లిదండ్రులకు తెలియని ఎడ్యుకేషన్ క్రైమ్‌ని, ఒక్కో విద్యార్థితో రూ.10,000 తీసుకొని ఈ ఎడ్యుకేషన్ క్రైమ్ లో భాగమైన ఆ కళాశాల, కారుణ్య అకాడమీల బాగోతాన్ని ఆధారాలతో సహా నిరూపిస్తాం. **చర్యలు తీసుకునేందుకు ఆర్ఐఓ సిద్ధమా..?**

**అనంతపురం మేజర్ న్యూస్ ప్రతినిధి**



## భగీరథ మహర్షికి ఘన నివాళులు

**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్:**

భగీరథ మహర్షి జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ దగ్గర గల కేర్ , క్యూర్ హాస్పిటల్ ఎదురుగా వున్న భగీరథ మహర్షి విగ్రహానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు అందరికీ భగీరథ మహర్షి జయంతి మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మానవ ప్రయత్నంతో చాలా పెద్ద సాధనను చేయొచ్చు అనేదానికి భగీరథ మహర్షి ఒక ఉదాహరణ అని అన్నారు. జిల్లాకు అది వర్తిస్తుందని, కరువు జిల్లా, తక్కువ వర్షంపడే ప్రాంతం అయినా కూడా ప్రభుత్వం నుంచి చేస్తున్న ప్రయత్నాలు

మిగతా 2లో



## జె.సి.ప్రభాకర్ రెడ్డి విమర్శలను ఖండించిన సిపిఎం

- గత వైసీపీ పాలనలో కార్మిక సమస్యలపై తాడిపత్రి లో మేము చేసిన పోరాటాల్లో మీరు పాల్గొన్నది నిజం కాదా
- రాంభూపాల్ దంపతులకు ఒకటిన్నర సెంటు ఇళ్లు, వెయ్యి రూపాయల బ్యాంకు అకౌంట్ తప్ప ఎలాంటి భూమి, డబ్బు ఎక్కడున్నా మీరే దానం చేయండి..

5 లో



ఆర్ఎంపీల చేతిలో బలైన బోయ పార్వతమ్మ

- మామూళ్ల మత్తులో జోగుతున్న జిల్లా వైద్యాధికారిణి
- పేదప్రజల ప్రాణాలంటే లెక్కచేయని డీఎంహెచ్ ఓ ను సస్పెండ్ చేయాలి.
- డిమాండ్ చేసిన బీసీవై పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గౌని ప్రతాప్ రెడ్డి

## నకిలీ ఆర్ఎంపీ చేతిలో దుర్గంలో మరో మహిళ మృతి

### పేద ప్రజల ప్రాణాల పట్ల యమభటులైన ఆర్ఎంపీలు

### వచ్చీరానివైద్యంతో 45 రోజుల్లో రెండు ప్రాణాలను బలిగొన్న వైనం

**రాయదుర్గం, మేజర్ న్యూస్:**

రాయదుర్గం పట్టణం పైతోటకు చెందిన బొమ్మన్న భార్య బోయ పార్వతమ్మ (50) అనే మహిళ వైద్యం వికటించి శనివారం మృతి చెందింది. కుటుంబసభ్యులు బంధువులు తెలిపిన మేరకు గుమ్మగట్ట మండలం జాలివంక గ్రామానికి చెందిన పార్వతమ్మ కు సంతానం కలుగక పోవడంతో ఆమె భర్త రెండో పెళ్లి చేసుకోగా, ఆమె తన పుట్టిల్లు అయిన జాలివంక గ్రామంలోనే జీవనం సాగిస్తోంది. ఈమె కు వాంతులు విరేచనాలు కావడంతో శనివారం ప్రాతః కాల సమయం లోనే రాయదుర్గం పట్టణంలో మూసా క్లినిక్ (ఖలీల్) నడుపుతున్న ఆర్ఎంపీల వద్దకు చికిత్స నిమిత్తం బంధువులు తీసుకొచ్చారు. ఆర్ఎంపీ వైద్యులు మూడు బాటిళ్లు సెలెయిన్ ఎక్కించి, సెలెయిన్ లోకి ఏవేవో ఇంజక్షన్ లు వేసి చికిత్స అందించగా, వైద్యం వికటించి

మిగతా 4లో



శింగనమల మండలంపై

## ఓ లుక్ వేయండి విద్యుత్ సారూ..!

### రాజకీయ గ్రహణంలో కిందిస్థాయి విద్యుత్ శాఖ సిబ్బంది.. రైతన్నలకు, ప్రజలకు మాట వినని వైనం..!

**శింగనమల,మేజర్ న్యూస్ :** శింగనమల మండలంలో విద్యుత్ సప్లైలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో మండల ప్రజలు తీవ్ర నరకం చూస్తున్నారు.అసలు ఏందుకు ఇలా జరుగుతుందో చెప్పే విద్యుత్ ఉద్యుగులు కరువయ్యారని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరికొంతమంది కింది స్థాయి విద్యుత్ ఉద్యోగులు వారి గ్రామాలలో రాజికీయాలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.ఏదైనా అవసరం వుండి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కాని లైన్‌మేన్‌కు కానీ రైతన్నలు,ప్రజలు ఫోన్ చేస్తే ఫోన్ ఏత్తలేని అంతా బిజీగా వున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దిక్కులేని పరిస్థితులలో వారు విద్యుత్ శాఖ కార్యాలయం లేదా సబ్ స్టేషన్ల వద్దకు వస్తే తమకేమీ తెలియదని మా పైన వున్న అధికారి చెబితేనే మేము వింటాం అనీ నిర్లక్ష్య సమాధానాలు

మిగతా 2లో

## శింగనమల మండలంపై
# ఓ లుక్ వేయండి విద్యుత్ సారూ..!

▸▸ మొదటి పేజీ తరువాయి

చెబుతూ చేతులు దులుపు కుంటున్నారు.కన్నతల్లిలాంటి మరియు అన్నం పెడుతున్న వారి మాతృ సంస్థ గురించి అడగడానికి ప్రజలు ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తి కరెంట్ ఎప్పుడు వస్తుందో చెప్పలేనంత బిజీలో వారు వున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సిన విద్యుత్ శాఖ ఉన్నత ఉద్యోగులు వారి ఆదాయం కోసం అవినీతి సంపాదనలో బిజీగా వున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. గత మూడు రోజుల నుండి విద్యుత్ సరిగా లేకపోవడం తో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ప్రజలు తాగడానికి నీరు కూడా లేని పరిస్థితులలో వున్నట్లు తెలుస్తోంది.విద్యుత్ శాఖ జిల్లా అధికారులు అసలు శింగనమల మండలంలో ఏమి జరుగుతుందో విద్యుత్ శాఖ పై రైతన్నలు,మండల ప్రజలు ఏమనుకుంటున్నారో విచారిస్తే అప్పుడు మీకే అర్థం అవుతుందని మండల ప్రజలు,రైతులు తెలియజేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో రెండు గంటలసేపు పాములు సయ్యాట

కనేకల్లు, మేజర్ న్యూస్ : కనేకల్లు మండల పరిధిలోని బ్రహ్మసముద్రం



ఉన్నత పాఠశాల నందు ఆదివారం పాఠశాల ఆవరణలో రెండు గంటలసేపు పాములు సయ్యాట ఆ గ్రామస్తులను కనువిందు చేసింది. ఈ పాముల సయ్యాటను చూడడానికి వందలాదిమంది పాఠశాల దగ్గరికి చూడడానికి వచ్చారు రెండు గంటలైనా పెద్ద పెద్ద శబ్దాలు చేస్తున్న మనుషులు చెక్కచెదరకుండా పాముల సయ్యాట సాగింది. పాఠశాలకు ఆదివారం సెలవు కాబట్టి విద్యార్థులకు ప్రమాదం తప్పింది ఇదే గ్రామంలోనే పలుచోట్ల ఈ పాముల సయ్యాటలు కొనసాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

## కత్రిమలలో ఘర్షణ-ఒకరు మృతి

పామిడి, మేజర్ న్యూస్: మండలంలోని కత్రిమల గ్రామంలో ఇటీవల



జరిగిన ఘర్షణలో వడ్డే నాగేంద్ర (26) మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీ సులు వివరాల మేరకు... మండలంలోని కత్రిమల గ్రామానికి చెందిన వడ్డే నాగేం ద్ర ఎనుములు పెట్టుకొని జీవనం కొనసాగించేవాడన్నారు. ఎనుముల ఎరువు వేసు కునేందుకు, పశుగ్రాసం నిల్వ చేసుకునేందుకు కల్లందొడ్డిని కొనుగోలు చేశాడన్నారు. అయితే అప్పటికే కల్లందొడ్డిని వినియోగించుకుంటున్న పెద్దసుబ్బారెడ్డి కుటుంబీకులతో కల్లందొడ్డి విషయంలో ఈనెల 2న మాటమాట పెరిగి వాగ్వివాదం చోటుచేసు కుందన్నారు. ఈ వాగ్వివాదంపై అదేరోజు అర్ధరాత్రి పెద్దసుబ్బారెడ్డి కుటుంబీకులతో పాటు వారి బంధువులను పిలిపించి వడ్డే నాగేంద్రపై దాడికి పాల్పడ్డాడన్నారు. ఈ దాడిలో గాయపడిన వడ్డే నాగేంద్రను అనంతపురం ఆసుపత్రికి తరలించారన్నారు. అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీ సులు తెలిపారు. మృతుడు వడ్డే నాగేంద్రకు భార్య వడ్డే అనూషతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నట్లు తెలిసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉచిత ఖత్నా-నిత్యవసర సరుకులు అందజేత



పామిడి, మేజర్ న్యూస్: పట్టణంలోని షాదీఖానాలో ఆదివారం పలువురు ముస్లిం మైనా ర్టీలు ఉచిత ఖత్నా నిర్వహించారు. ఈ సందర్భం గా 50 మందికి ఖత్నా నిర్వహించా మన్నారు. అలాగే వారికి నిత్యవసర సరుకులైన గోధుమపిండి, బెల్లం, కొబ్బెర, దుస్తులు, మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నజీర్, ఇంతియాజ్, ఖలందర్, జమీర్, ఖాజా, షేక్షా, సల్మాన్, హసేన్, జిలాన్, శైలూ, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షికి ఘన నివాళులు

▸▸ మొదటి పేజీ తరువాయి



అయిన ఉపాధి హామీ పథకం, జల్ శక్తి అభియాన్, లాంటి పథకాలను జిల్లా లో సజావుగా అమలు చేస్తున్నామన్నారు. అందరూ మంచినీరు, తాగనీటిపై జవాబుదారీగా ప్రవర్తించాల న్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడు తూ భగీరథ జయంతి సందర్భంగా భారతదేశ వ్యాప్తంగా ఉన్న సగర ఆత్మీయ బంధువులకు శుభాకాంక్షలు తెలిపారు. భగీరథుడు ఎలాంటి ప్రయత్నాలు చేపట్టారు అనేది గుర్తుంచుకోవాలని, కరువు సీమలో నీటి కోసం తన శక్తి వంచన లేకుండా ధారపోసి భూమి లోపల నుంచి నీటిని తీసుకువచ్చి అపర భగీరథ ప్రయత్నం గురించి మనం మాట్లాడుకుంటామని, ఎంత కష్టంతో కూడుకున్నదైనా సాధించేందుకు మొక్కవోని దీక్షతో ప్రపంచంలోనే మానవాళికి ఉపయోగపడేటువంటిది భగీరథ ప్రయత్నంగా మనం భావించాలన్నారు. అలాంటి నీటి వనరులను గుర్తించి బయటకు తీసుకువచ్చి మనందరికీ స్ఫూర్తిదాయ కమైనటువంటి, కఠోరమైన శక్తిని చూపించిన మహానుభావుడుగా భగీరథ మహర్షి మనందరి హృదయాలలో నిలిచిపోయారన్నారు. భగీరథ మహర్షి ప్రయత్నాలను ఎలా సఫలీకృతం చేసారో అలాంటి ప్రయత్నాలను రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు చేస్తున్నారని, భగీరథ ప్రయత్నంతో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి నీటి సదుపాయాన్ని రాష్ట్రానికి కల్పించే ఆలోచనతో పనిచేస్తున్నారన్నారు. భగీరథ మహర్షి ఆశీస్సులు రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి, మనందరికీ ఉండాలని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.




## సమస్యల సాధనకు వడ్డెర్లు సంఘటితంగా పోరాడాలి

### పట్టణ వడ్డెర్ల నూతన కమిటీ ఏర్పాటు

ఉరవకొండ, మేజర్ న్యూస్ : వడ్డెర్లు సమస్యల సాధనకు సంఘటితంగా పోరాడితేనే వాటి సాధన సాకారమవుతుందని వడ్డెర్ల నాయకులు సంజీవ రాయుడు, నారాయణస్వామి, పెద్దన్న, మారెన్న అన్నారు. ఆదివారం స్థానిక రోడ్లు భవనాల అతిథి గృహంలో పట్టణ వడ్డెర్లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డెర్ల ప్రతినిధులు పట్టణ వడ్డెర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా వి సంజీవ రాయుడు, ఉపాధ్యక్షులుగా వి. లాలు స్వామి, వి. శివ, ప్రధాన కార్యదర్శిగా వి. శివ శంకరయ్య, కార్యదర్శిగా వి. చిన్న బాబు, వి. శివకుమార్, కోశాధికారిగా వి. గంగరాజు, గౌరవ సలహాదారులుగా వడ్డే రమేష్, వడ్డే మారెన్న మిగిలిన వారిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వడ్డెర్ల ప్రతినిధులు మాట్లాడుతూ వడ్డెర్లు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగితేనే రాజకీయంగా అవకాశాలు దక్కుతాయని గుర్తు చేశారు. సామాజిక భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణముతో పాటు మండల వడ్డెర్లు పాల్గొన్నారు.

## ఆర్డిటి ఎఫ్సిఆర్ఏ పునరుద్ధరణ సాధనకు... రేపు రౌండ్ టేబుల్ సమావేశం

### పార్టీలు, ప్రజా సంఘాలు తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపానికి తరలిరావాలని పిలుపు



ఉరవకొండ, మేజర్ న్యూస్ : ఆర్డిటి సంస్థకు విదేశాల నుంచి వచ్చే నిధుల ఖాతాను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడం సరైన విధానం కాదని, ఖాతాను తక్షణమే పునరు ద్ధరించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఎర్రి స్వామి రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు 2 ఈడిగ ప్రసాద్, నాయకులు బసవరాజు పిలుపుని చ్చారు. ఆదివారం స్థానిక రోడ్లు భవనాల అతిథి గృహం వద్ద వారు విలేకరు లతో మాట్లాడారు. ఐదు దశాబ్దాలుగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలతో పాటు కరువు జిల్లా అనంతలో ట్రస్టు అలుపెరుగని ఎన్నో సామాజిక సేవలు అందించిందని గుర్తు చేశారు. ఎంతోమంది పేద విద్యార్థులను సంస్థ సొంత నిధులు వెచ్చించి వారి ఉన్నత చదువులకు తోడ్పాటు అందించి, వారిని డాక్టర్లుగా, ఇంజనీర్లుగా తీర్చిదిద్దినట్లు కొనియాడారు. ఆర్డిటి సంస్థ కు విదేశాల నుంచి వచ్చే నిధుల ఖాతాను పునరుద్ధరించేందుకు 2025 మే 6 వ తేదీన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రౌండ్ టేబుల్ సమావేశానికి పిలుపునిచ్చి నట్లు తెలిపారు. స్థానిక తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపంలో జరిగే చర్చావేదిక కార్యక్రమానికి ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరుతున్నట్లు తెలిపారు. అందరూ కలిసి పోరాడితేనే ఆర్ డి టి ఎఫ్సిఆర్ఏ ఖాతా సాకారం అవుతుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్ర మంలో వైకాపా నాయకులు బీమా, కృష్ణయ్య, ఎర్రి స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్యాళ్ళ ప్రసాద్, ఆపద్బాంధవ ట్రస్టు వ్యవస్థాపకులు వేల్పుల మురళి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన
# 332 గురుపూజాకు తరలిరండి

### - అర్చకులు బాలకృష్ణ స్వామి



కనేకల్లు, మేజర్ న్యూస్ : కనేకల్లు మండల కేంద్రం తారక రామ్ నగర్ లో వెలిసిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నందు ఈ నెల ఆరవ తేదీ అనగా మంగళవారం ఉదయం 8 గంటలకు శ్రీ వీర బ్రహ్మంగారి స్వామి 332 గురుపూజ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఆలయ ప్రధాన అర్చకులు బాలకృష్ణ స్వామి సందర్భంగా బాలకృష్ణ స్వామి మాట్లాడుతూ మంగళవారం ఉదయం నుండి అన్నదాన కారిక్రమము రాత్రి 7 గంటలకు నుండి 1గంట వరకు భజన అఖండ భజన, గణపతి పూజ, వివిధ అభిషేకాలు హెూమం లు జరుగునని తెలిపారు. 7వ తేదీన బుధువారం ఉదయం 7గంటల నుండి 11గంటల వరకు శ్రీ వీరబ్రాహ్మద్ర స్వామి వారి ఊరేగింపు, తారకరామానగర్ నుండి శ్రీ చిక్కనేశ్వర స్వామి గుడి వరకు ప్రధాన వీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కణేకల్ గ్రామం తారకరాంనగర్ శ్రీ వీరబ్రాహ్మద్ర స్వామి దేవాలయ భక్తదులు అందరు విచ్చేసి స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందాలని భక్తులకు తెలిపారు.

## ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య



గుమ్మగట్ట, మేజర్ న్యూస్: గుమ్మగట్ట మండ లం రంగ చేడు గ్రామంలో ఆదివారం విషా దం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ (29) అనే వివాహిత ఉరి వేసు కొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ కల హాల నేపథ్యంలో ఈశ్వరమ్మ ఆత్మహత్య చేసు కున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనపై గుమ్మగట్ట పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## పేకాట రాయుళ్లు అరెస్ట్

### -7 బైకులు, 10 సెల్ఫోన్లు స్వాధీనం



రాయదుర్గం, మేజర్ న్యూస్: పట్టణ పరిధిలోని మొలకాల్మూరు రోడ్డు సమీపంలోని ఓ వ్యవసాయ తోటలో పేకాట అడుతున్న 10 మందిని ఆదివారం పట్టుకుని అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ జయానాయక్ తెలిపారు. రాబడిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి 7 ద్విచక్రవాహనాలు, 10 మొబైల్ ఫోన్లతో పాటు రూ.75,840 లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు నూర్ మహమ్మద్, సుంకన్న, అశోక్, వీరేంద్ర పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ
# కార్మికుల దినోత్సవం



**కూడేరు మేజర్ న్యూస్:** కూడేరు మండలం ముద్దలాపురం గ్రామం లోని లక్ష్మీదేవమ్మ కాలనీలో అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఏ ఐ కె ఎమ్ ఎస్ జిల్లా కోశాధికారి రాయుడు ఎర్రజెండాని ఎగరవేసి ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కామ్రేడ్ రాయుడు మాట్లాడుతూ 139 సంవత్సరాలు వెనక్కి వెళితే ఆనాడు పరిపాలిస్తున్నటువంటి తెల్ల దొరలు పరిశ్రమల యాజమాన్యం బెల్లం ఫ్యాక్టరీ చక్కర ఫ్యాక్టరీ అదేవిధంగా సిమెంట్ ఫ్యాక్టరీల యజమాన్యాలు లారీ యజమాన్యాలు కార్మికులతో 18 గంటలు పని చేయించుకొని వారి శ్రమ అంతా దోపిడీ చేస్తున్న తరుణంలో ఎందరో మహానుభావులు కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి కార్మికులందరికీ అండగా నిలబడే బలోపేతమైన ఉద్యమాలు చేయడం వల్ల %శ్రీ% ఎంతోమంది రక్తతర్పణ చేయడం వల్ల ఒక తెల్లటి గుడ్డను తీసుకొని వారు రక్తంలో ఆ గుడ్డను తడిపి ఆ గుడ్డను ఎర్రజెండాగా మార్చి ఎగరవేయడం జరిగింది అప్పుడే కార్మికులు చేస్తున్నటువంటి పని దినాలను 12 గంటల 8 గంటల వరకే చేయాలని నిర్ణయించి వారి చేస్తున్న శ్రమకు తగ్గట్టుగా గిట్టుబాటు కూడిదలను సాధించుకున్న రోజు కావడం వల్లనే ఈ మే నెలలో మే డే గా ప్రకటించడం జరిగింది అని కామ్రేడ్ రాయుడు వివరించడమైనది అంతేకాకుండా ఇవాళ దేశంలో నరేంద్ర మోడీ పరిపాలనలో బడుగు బలహీన వర్గాలను అదేవిధంగా ఆదివాసీలను మావోయిస్టు పార్టీ లీడర్లను కార్యకర్తలను తన ఉక్కు పాదంతో అణిచివేసి వేలాదిమంది మావోయిస్టులను గిరిజనులను పట్టణ పెట్టుకోవడమే కాకుండా మావోయిస్టులకు సపోర్ట్ చేసిన ఏ ఒక్కరిని కూడా వదిలిపెట్టనని తనకు మీటింగ్ పెట్టిన ప్రతిచోట నరేంద్ర మోడీ గారు ఆర్భాటంగా ప్రకటించడం జరుగుతుంది కాబట్టి మావోయిస్టు దళాలు ఒక్కసారి నీపై గన్నులు ఎక్కువ పెట్టి కన్ను ఎర్ర చేస్తే నరేంద్ర మోడీని ఒకే ఒక్కసారి పాతాళానికి పంపించడానికి తల నాయకులతో పట్టి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని నరేంద్ర మోడీ తెలుసుకోవాలని నీలాంటి దేశద్రోహికి రాబోవు 2029 ఎన్నికల్లో ప్రజల సరైన బుద్ధి చెప్తారు అని తెలిపారు.



## ఆస్పత్రి వద్ద అన్నప్రసాద వితరణ...

**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** చారిటబుల్ ట్రస్ట్ పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్ పర్సన్ నిర్మల మురళి అన్నప్రసాద వితరణ గావించారు. ట్రస్ట్ సభ్యులు రామన్న ఆయన సతీమణి అరుణ వారి కుమార్తె తనూజ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. దాదాపు 150 మందికి భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్రమణ్యం, నబి రసూల్, శివయ్య, పాపయ్య, లక్ష్మీనారాయణ, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

## గుంతకల్లు టిప్పుసుల్తాన్ ఇత్తహాదుల్ ముస్లిమీన్ కమిటీ ఆధ్వర్యంలో హజరత్ టిప్పుసుల్తాన్ 226వ వర్ధంతి




**గుంతకల్లు అర్బన్, మేజర్ న్యూస్ :** ఆంగ్లేయవలస పాలకుల పాలిట సింహా స్వప్నంగా నిలిచిన మైసూర్ పులి టీపూ సుల్తాన్ 226వ వర్ధంతి సందర్భంగా కార్యక్రమాలు గుంతకల్లు పట్టణంలోని టి ఐ ఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశ తొలి స్వతంత్ర సమరయోధునిగా ప్రాణాలు అర్పించిన అమరుడు టిప్పు సుల్తాన్, ఆయన రాజ్యంలో అత్యున్నత పదవులు బ్రాహ్మణులు కట్టబెట్టడం మరియు లౌకిక వాదానికి మతసామరస్యానికి ప్రతీకగా ఉంది. మసీదుకు మందిరానికి మధ్య తేడా లేకోకుండా అన్ని వర్గాల వారికి సమాన పాలన సమన్యాయం కొనసాగించారు. మొట్టమొదటిసారిగా ఆంగ్లేయుల ఉనికిని మనుగడను గ్రహించి వారిని అడ్డగించిన తొలి భారతీయ రాజుగా పేరు ఆయన చేసిన సంస్కరణలను రాకెట్ ఆవిష్కరణ మిస్సైల్, ఫిరంగి భూసంస్కరణలు మరియు అనేక హిందూ దేవాలయాలకు శరణా శరణాలయాలతో మఠాలకు విరాళాలు అందించి నిర్మాణాలకు సహకరించడం ఆయన రాజ్యంలో మతసామరస్యానికి అద్దం పడుతుంది. అటువంటి మహోన్నత వ్యక్తికి నేటికీ కూడా 200సంవత్సరాల పైన ఆయన పేరు వార్తల్లో ముందుకు రావడం గమనించదగ్గ విషయం ఆయన చరిత్రను వక్రీకరించడం ఇప్పుడు ఉండే పాలకులకు మింగుడు పడక ఆయన చరిత్రను తొలగించడం కూడా జరిగింది. కానీ ఇటువంటి అమరులు మరియు మహోన్నత వ్యక్తులు అమరులై ఉంటారు. వారిని స్మరిస్తూ టిప్పుసుల్తాన్ ఇత్తహాదుల్ ముస్లిమీన్ కమిటీ ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలందు చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది.

ఈ కార్యక్రమంలో టిప్పుసుల్తాన్ ఇత్తహాదుల్ ముస్లిమీన్ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండిఆర్ ఖలీల్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం మౌలా, పట్టణ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్, కోశాధికారి పఠాన్ దాదాఖాన్, పట్టణ కార్యదర్శి షేక్ ఇమ్రాన్, పట్టణ మాజీ అధ్యక్షులు దాదా ఖలందర్, గౌరవ అధ్యక్షులు మసూద్, సద్దాం హుస్సేన్, లెజెండ్ రంజాన్ సలహాదారులు అక్రమ్ భాష,సహాయ కార్యదర్శి సిలార్ శిక్షావలి, మరియు సభ్యులు ఆయుర్ భాష, రెక్సిన్ గౌస్,కాజా, అబ్దుల్ బాసిత్ దస్తగీర్, నౌషాద్ అలీ, అయజ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలలో
# ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి..

### జిల్లాలో అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలి..

### ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి




**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** అనంతపురం నగరంలో నీలం రాజ శేఖర్ రెడ్డి భవనంలో ఆదివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి హాజరై మాట్లాడారు. అనంతపురం జిల్లాలో కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యులు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే శ్రీ చైతన్య నారాయణ ఎడిఫై భాష్యం ఏజీఎస్ ఎస్సార్ ట్రెల్లిస్ కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు చేస్తున్నారని తెలిపారు,ఇప్పటికే అనేకసార్లు జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ కి ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారని వినతిపత్రం ధర్నాల రూపంలో తెలియజేసిన ఇంతవరకు ఒక విద్యా సంస్థల పైన కూడా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న, నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని కుల్లాయి స్వామి హెచ్చరించారు కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్, కోశాధికారి నాని, నగర సహాయ కార్యదర్శి సమీర్, నాయకులు ప్రవీణ్, తరుణ్, తౌకిర్, మెహది తదితరులు పాల్గొన్నారు.

## కుల గణన బిల్లు ఆమోదానికి పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలి

**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్:** రాబోయే జాతీయ జనాభా గణన లో కుల గణన చేర్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం చారిత్రాత్మక నిర్ణయమని, అయితే బిల్లు ఆమోదానికి వెంటనే పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని ప్రజా సైన్స్ వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎం సురేష్ బాబు, ఎం ఈ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, ఆర్పిఎస్ యువ నాయకులు జీవి ఉజ్వల్ కోరారు. ఆదివారం వారు నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో కులం అత్యంత ప్రతిభావంతమైన సామాజిక నిర్మాణాలలో ఒకటి అని, దాదాపు దశబ్ద కాలంగా ప్రభుత్వం వద్ద కుల జనాభా పై సమగ్ర డేటా లేదని తెలిపారు. కుల గణన డేటా లేకపోవడం వల్ల ప్రతిభావంతమైన విధాన రూపకల్పన, వనరులు, రిజర్వేషన్ల పంపిణీకి ఆటంకం కలిగించిందని తెలిపారు. కుల గణన సామాజిక అసమానతలు నివారించడానికి, సంక్షేమ పథకాలు అందించడానికి ఎంతో తోడ్పడుతుందని వారు తెలిపారు. సమగ్ర కుల గణన కోసం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు కేంద్ర ప్రభుత్వం నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.





## క్రికెట్ బెట్టింగ్ కేసులో
# ముగ్గురు నిందితుల అరెస్ట్

- **4,02,000/- రూపాయలు, 3 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొన్న పోలీసులు**
- **జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో క్రికెట్ బెట్టింగుపై ఉక్కుపాదం మోపిన గార్లదిన్నె పోలీసులు**
- **ముగ్గురు క్రికెట్ బెట్టింగురాయుళ్లు అరెస్టు**
- **గార్లదిన్నె పోలీసు స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించిన అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశులు**

గార్లదిన్నె మేజర్ న్యూస్ :

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ నందు అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశులు విలేకరుల సమావేశంలో క్రికెట్ బెట్టింగ్ కేసులో ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్ చేసి. 4,02,000/- రూపాయలు మరియు 3 సెల్ ఫోన్ లను స్వాధీనము చేసుకున్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశులు పేర్కొన్నారు.

**అరెస్టు నిందితుల వివరాలు :** 1) శ్యామల రాజశేఖర్, వయస్సు 40 సం.లు, కల్లూరు గ్రామం, గార్లదిన్నె మండలం 2) పెమ్మక సుధీర్ రెడ్డి, వయసు 39 సం.లు, తరిమెల గ్రామం, శింగనమల మండలం. 3) పెమ్మక భాస్కర్ రెడ్డి, వయస్సు 43 సం.లు, తరిమెల గ్రామం, శింగనమల మండలం.

**నేపథ్యం, అరెస్టు :** ప్రస్తుతం అరెస్టయిన ముగ్గురూ ఒకరికొకరు మంచి పరిచయస్తులు. ఈ ముగ్గురూ తాగుడు, తదితర వ్యసనాలు/ జల్సాలకు అలవాటుపడ్డారు. జల్సాలను తీర్చుకునేందుకు సులువుగా డబ్బు సంపాదించాలని భావించారు. ఈ ఐపీల్ సీజన్ ను అనుకూలగా మలుచుకున్నారు. క్రికెట్ బెట్టింగు లకు పాల్పడి డబ్బు సంపాదించాలని అనుకుని కల్లూరు గ్రామంలోని శ్యామల రాజశేఖర్ ఇంటి వద్ద నిందితులందరూ కలిశారు. అమాయకపు ప్రజలకు బెట్టింగ్ ఆశ కల్పించారు. వారితో బెట్టింగ్ కోసం డబ్బులు వసూలు చేసుకొని వీరు అందరూ వారి సెల్ ఫోన్ లో స్టార్ స్పోర్ట్స్ లో క్రికెట్ ఐపీల్ సీజన్-18, షెడ్యూల్ 22 మార్చి 2025 నుండి జరిగే ఐపీల్ క్రికెట్ మ్యాచ్ లను చూస్తూ అలాగే క్రీ యాప్ లో వచ్చే టీమ్ ఫేవరెట్ పాయింట్స్ రేటింగ్ ఆధారంగా డబ్బులు పెడుతూ మ్యాచ్ తరువాత వచ్చిన లావాదేవీలను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పంచుకొంటూ ఉండగా పక్కా రాబడిన సమాచారంతో పోలీస్ బృందం ఈ ముగ్గుర్ని అరెస్టు చేసింది.

**కేసు నమోదు:** సి ఆర్ నెంబర్ .73/2025 యూ/స్ ఏపీ గేమింగ్ యాక్ట్(క్రికెట్ బెట్టింగ్) గార్లదిన్నె పోలీస్ సింగనమల సిఐ కౌలుట్లయ్య, గార్లదిన్నె ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాష, విజయ్ కుమార్, ఎస్సై సింగనమల, మరియు వారి సిబ్బంది హెచ్సీఏ అంజనరెడ్డి, పి సి ఎస్ కృష్ణ, దివాకర్, నాగేష్, ఫరూక్, నరేశ్, వెంకటేష్, హెచ్ జి. అమర్నాథ్

**ప్రశంస :** క్రికెట్ బెట్టింగు ఆడుతున్న ముగ్గుర్ని అరెస్టు చేసిన అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశులు పర్యవేక్షణలో సి.ఐ కౌలుట్లయ్య, ఎస్సైలు గౌస్ మహమ్మద్ బాషా, విజయకుమార్ ల బృందాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

## నేడు బుక్కరాయసముద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

### బుక్కరాయసముద్రం మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్



**శింగనమల, మేజర్ న్యూస్ :** నేడు సోమవారం బుక్కరాయసముద్రంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి ఐ.ఏ.ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని బుక్కరాయసముద్రం మండల పరిధిలోని చెరువుకట్ట వద్దనున్న శ్రీ సాయిబాబా కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. బుక్కరాయసముద్రం మండల ప్రజలు ప్రత్యేక పిజిఆర్ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## హనకనహల్లులో శ్రీ బచ్చన కళేశ్వర స్వామి శ్రీ వసికేరప్ప స్వామికి పట్టాభిషేక మహోత్సవం



**కనేకల్లు, మేజర్ న్యూస్ :** కనేకల్ మండల పరిధిలోని హనకన హాల్ గ్రామములో వెలసిన శ్రీ బచ్చునకళేశ్వర స్వామి దేవాలయం మరియు శ్రీ వసికిరప్పస్వామి దేవాలయం దేవుళ్లకు మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం ఆలుమత గురువులైన శ్రీ మృత్యుంజయ స్వామి వడియార్ ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవ వేడుకలు గత మూడు రోజులుగా నుండి వివిధ పూజలు నిర్వహిస్తున్నారు. కురుబ కులస్తుల ఆరాధ్య దైవములైన సిరిగినమలే శ్రీ రామప్ప స్వామి, హనకనహళ్ళు శ్రీ బొగ్గు లింగేశ్వర స్వామి శ్రీ జూలైటప్ప స్వామి, గోవిందవాడ శ్రీ విడపనకల్లప్ప స్వామి, మాల్యం శ్రీ ఉజ్జయినయ స్వామి, శ్రీ నాగలాపురం దయ స్వామి, ఆదిగానపల్లి శ్రీ డొనేకలప్ప స్వామి లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ స్వాములకు రాయదుర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్షలాది మంది ఈ దేవరలో పాల్గొన్నారు.

## దేవస్థానముల నిర్మాణానికి రూ.20వేలు విరాళం - సాయి క్రిష్ణ హాస్పిటల్ హిమబిందు దంపతులు



**గుంతకల్లు అర్బన్, మేజర్ న్యూస్ :** గుంతకల్లు పట్టణంలోని పాత గుంతకల్లు 22 వ వార్డు కొనకొండ్ల గేట్ నుంచి వాల్మీకి సర్కిల్ కి పోవు దారి నందు ఆర్డిటి బిల్డింగులు వెనక గల శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఈశ్వరి మాత దేవస్థానంల నిర్మాణం జరుగుతూ ఉంది. ఈ దేవస్థానముల నిర్మాణానికి సాయి క్రిష్ణ హాస్పిటల్ హిమబిందు దంపతులు విరాళముగా రూ.25వేలు ఇవ్వటం జరిగినది. ఈ కుటుంబానికి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులు ఈశ్వరి దేవి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆలయ కమిటీ ధర్మకర్త రుద్రాక్షల బొట్టుకుల్లాయప్ప మరియు ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## నకిలీ ఆర్ఎంపీ చేతిలో దుర్గంలో మరో మహిళ మృతి

▸▸ మొదటి పేజీ తరువాయి

ఉదయం 7 గంటలకు మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు.

### మార్చినెలలో ఇదే క్లినిక్ లో చికిత్స పొందిన మూడేళ్ల చిన్నారి మృతి:

గుమ్మగట్ట మండలం గలగల గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, లక్ష్మీ దంపతుల మూడో కుమార్తె మూడేళ్ల అనుశ్రీ మార్చి 21న మృతి చెందగా, డీఎంహెచ్ ఓ ఈబీ దేవి వచ్చి క్లినిక్ ను సీజ్ చేసింది. అయితే మూసా క్లినిక్ పేరుతో ఒకే ఇంట్లో వైద్యం చేస్తున్న ముగ్గురు ఆర్ఎంపీలు మాత్రం వారి దందా వదల్లేదు. అక్రమంగా అడ్డమార్గాల్లో వైద్యం చేస్తూ తమ వ్యాపారాన్ని మాత్రం కొనసాగిస్తున్నారు. ఎదురుగా ఉన్న ఎక్స్ రే గదిలోను , ఇంటి వెనుక భాగాన వైద్యం చేస్తూనే ఉన్నారు. దీనికి కారణం వైద్యాధికారుల పర్యవేక్షణ లోపమే అని రాయదుర్గం నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటుఉన్నారు.

### సులభంగా ప్రాణాలు బలిగొంటున్నారు.

రాయదుర్గం నియోజకవర్గంలో ఫ్యాక్షనిజం, రౌడీయిజం, తీవ్రవాదం కంటే అత్యంత ప్రమాదకరమైనది ఆర్ఎంపీల వైద్యం అంటే అతిశయోక్తి కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 జిల్లాల్లో కూడా ఇంతటి ఘోరం జరిగిందో లేదో గాని రాయదుర్గం ఆర్ఎంపీలు మాత్రం ప్రాణాలను సులభంగా బలిగొంటున్నారు. ఈ ఏడాది జనవరి నెల నుండి మే 3వ తేదీ వరకు రాయదుర్గం నియోజకవర్గంలో ఆర్ఎంపీలు చేసిన వైద్యం వికటించి నలుగురి పేదల ప్రాణాలు బలికాబడ్డాయి. అయినా వారిలో ఎలాంటి ఆందోళన గాని, ఆవేదన గాని లేకపోవడం వారి విచ్చలవిడి తనానికి నిదర్శనం. పేద ప్రజల ప్రాణాల పాలిట వారు యమ భటులుగా మారారు. ప్రాణాలు తీయడం రాజకీయాల పలుకుబడితో పోయిన ప్రాణాలకు కేవలం రూ.3 లక్షల నుండి రూ.5 లక్షల లోపు విలువ కట్టి, కుటుంబసభ్యులతో తమకు అనుకూలంగా చెప్పించుకుని, కేసులు లేకుండా చేసుకోవడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇంతటి ఘోరం జరుగుతున్నా జిల్లా వైద్యాధికారులు గాని ఇదే ఉమ్మడి జిల్లాకు చెందిన వైద్యశాఖామంత్రి గాని పట్టించుకోకపోవడం పై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ప్రాణాలు తీసి, ఆ ప్రాణాలకు ఖరీదు కట్టేవారినే అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రోత్సహిస్తుంటే సామాన్య మానవుడికి భద్రత ఎక్కడుందని చర్చించుకుంటున్నారు.

### డీఎంహెచ్ ను సస్పెండ్ చేయాలి: గౌని ప్రతాప్ రెడ్డి, అడ్వొకేట్ మరియు బీసీవై పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త





రాయదుర్గం నియోజకవర్గంలో విచ్చలవిడిగా చెలరేగి పోయి వచ్చీరాని వైద్యంతో ఆర్ఎంపీలు నెలకోసారి ప్రాణాలు తీస్తున్నా, ఆర్ఎంపీలు ఇచ్చే మామూళ్ల మత్తులో జోగుతూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీఎం అండ్ హెచ్ ఓ ఈబీ దేవిని వెంటనే సస్పెండ్ చేయాలని అడ్వొకేట్ మరియు భారత చైతన్య పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త గౌని ప్రతాప్ రెడ్డి విద్యాశాఖ మంత్రిని డిమాండ్ చేశారు. మూసా క్లినిక్ ను నడుపుతున్న ఆర్ఎంపీలు చేసిన వైద్యం వికటించి కేవలం 45 రోజుల్లోపే రెండు ప్రాణాలు గాల్లో కలిసిపోవడం అత్యంత బాధాకరమన్నారు. ధనదాహంతో ఆర్ఎంపీలు చేసే వైద్యం అనే వ్యాపారం వల్ల పేద ప్రజల ప్రాణాలకు విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని నమ్మి వస్తున్న సామాన్యులంటే వీరికి లెక్కలేకపోవడం అత్యంత నీచమన్నారు. మానవత్వం లేకుండా కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా వీరు చేస్తున్న దందాపై జిల్లా వైద్యాధికారులు గాని, రాయదుర్గం వైద్యాధికారులు గాని పెదవి మెదపకపోవడంలో ఆంతర్యమేమిటో అని అనుమానం వ్యక్తం చేశారు. ఆర్ఎంపీల వైద్యం పై చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు కోరినా డీఎంహెచ్ఓ పట్టించుకోలేదని, ఫోన్లు చేసినా ఆమె రిసీవ్ చేయదని ఆరోపించారు. జిల్లా మొత్తం చూడాల్సి ఉంటుంది అని చెబుతున్న ఆమె, జిల్లా మొత్తం బాధ్యత వహించడం చేతకాని పక్షంలో రాజినామా చేసి వెళ్లాలని, చేతనైన వారు విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉంటారని ఆయన డీఎంహెచ్ ఓ ఈబీ దేవికి హితవు చెప్పారు. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో పాటు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కూడా తక్షణమే నకిలీ ఆర్ఎంపీలు, పీఎంపీల పై చర్యలు తీసుకుని పేద ప్రజల ప్రాణాలకు భరోసా ఇవ్వాలని ఆయన కోరారు.

## బెలుగుప్ప గ్రామంలో ఘనంగా శ్రీ వాసవి జయంతి వేడుకలు





**బెలుగుప్ప, మేజర్ న్యూస్ :** బెలుగుప్ప గ్రామంలో ఆదివారం శ్రీ వాసవి జయంతి వేడుకలు ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీవాసవి అమ్మవారికి ఉదయం అభిషేకాలు నిర్వహించి అనంతరం అమ్మవారి రెండు కళశాలను మహిళలు (సుచరిత అశ్విని) తల మీద ఉంచుకొని మేళ తాళాలతో ఊరేగింపుగా పురోహితుడు రాంబాబు ఇంటి నుండి శ్రీ వాసవి దేవాలయం వరకు శ్రీ వాసవి మాత ఖడ్గాలను వల్లించుచు మందిరానికి చేరుకోవడం జరిగింది. ఆర్యవైశ్య మహిళలచే పారాయణం, హెూమము మరియు మహా మంగళ హారతి నిర్వహించబడింది. అనంతరం సాయంత్రం శ్రీ వాసవి మాత ఉత్సవ విగ్రహానిప్రత్యేకంగా అలంకరించి, పూలతో అలంకరించిన వాహనంలో ఉంచి మేళతాళాలతో డప్పులతో పురవీధుల గుండా ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు ఊరేగింపులో పాల్గొని ప్రధాని కాలనీలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు అందరూ పాల్గొని కార్యక్రమాలు నిర్వహించారు.

## ఉల్లాసంగా, ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**గుంతకల్లు అర్బన్, మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో 2002-2005 విద్యా సంవత్స రంలో బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్ లో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. 20 ఏళ్ల క్రితం దూరమైన స్నేహితులు కలుసుకున్న ఆనందంలో ఒకరి నోకరు ఆలింగనం చేసుకుంటూ, తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, అధ్యాపకులతో గడిపిన క్షణాలను వారు నెమరు వేసుకున్నారు. అలనాటి పాత జ్ఞాపకాలను గుర్తుకు చేసుకొని ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల డైరెక్టర్ పి గోపాల్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేయడం ఆనందదాయకమని, దీనివల్ల వ్యక్తుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. 20 సంవత్సరాల క్రితం విద్యా బోధన, బుద్ధి మాటలు నేర్పిన గురువులకు శాలువలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు అప్పటి గురువులను తలుచుకుంటూ వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మాట్లాడారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అప్పటి గురువులు నారాయణ, గోపి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సౌజన్య పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు జక్కి వేణుగోపాల్, రాకేష్, గణేష్ నవీన, సృజన పాల్గొన్నారు.

## హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను వేగవంతంగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి



**వజ్రకరూరు, మేజర్ న్యూస్ :** హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం వజ్రకరూరు మండలంలోని రాగులపాడు పంప్ హౌస్ వద్ద, ఉరవకొండ మండలంలోని వై.రాంపురం, కౌకుంట్ల మధ్యలో 211.8 కిలోమీటర్ వద్ద, బెలుగుప్ప మండలంలోని జీడిపల్లి డ్యాం వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ (హెచ్ఎన్ఎస్ఎస్) వెడల్పు పనులను జిల్లా కలెక్టర్ సమగ్రంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు పనులను నిర్దేశిత గడువులోపు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువ వెడల్పు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, ఆర్డీఓలు వసంతబాబు, ఎస్ఆర్బీఎస్ శ్రీనివాస్, ఈఈలు శ్రీనివాస నాయక్, శ్రీనివాసులు, తహసీల్దార్ మహబూబ్ భాష, డిఈలు, జెఈలు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



అనంతపురం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర శాఖ ఎన్నికలలో పలువురు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీ రాము నాయక్, సహ అధ్యక్షుడు వేణుగోపాల్ ఎన్నికల అధికారుల గా వ్యవహరించారు. నగర శాఖ అధ్యక్షులు గా ఎం షేక్ రఫీ (జిల్లా పరిషత్), నగర శాఖ ప్రధాన కార్యదర్శిగా హెచ్ వినోద్ కుమార్ (మెడికల్ డిపార్ట్మెంట్), ఎస్ టీ శ్రీనివాసులు జీఎస్టీ డిపార్ట్మెంట్ నగర శాఖ సహాధ్యక్షులుగా, జి నాగార్జున జిల్లా ఖజానా కార్యాలయం ,కే సుధాకర్ రావు జీఎస్టీ డిపార్ట్మెంట్, ఎం తిమ్మరాజు ఆర్ అండ్ బి, కే సుధాకర్ ఆయుష్ డిపార్ట్మెంట్, ఎల్ శ్రీనివాసులు జిల్లా పరిషత్, కే నగేష్ జీఎస్టీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు గాను కార్యనిర్వాహక కార్యదర్శిగా పి ఈశ్వరయ్య ఆర్ అండ్ బి, జి శ్రీనివాసులు జిల్లా ఖజానా కార్యాలయం, ఎస్ఐ పనింద్ర శర్మ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, సుజాత బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, జి పెద్ద రెడ్డయ్య పే అండ్ అకౌంట్స్ కార్యాలయం ,ఏ శివ శంకరయ్య ఆర్ మహేశ్వర నాయక్ కె భగీరథ రెడ్డి లు సచివాలయ శాఖ, సహాయ కార్యదర్శులు గాను కోశాధికారిగా మౌలా సాహెబ్ వైద్య కళాశాల ఏకగ్రీవంగా ఎన్నిక కాబడ్డారని జిల్లా అధ్యక్షులు గోపికృష్ణ తెలియజేశారు. ఈ సమావేశానికి సిపిఎస్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు ఐక్యవేదిక రాష్ట్ర జనరల్ సెక్రెటరీ బాజీ పటాన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

# ఘనంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు జన్మదిన వేడుకలు

## - పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు కార్యకర్తలు



మడకశిర మేజర్ న్యూస్: మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు 44వ జన్మదిన వేడుకలను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నాయకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా తొలుతగా అనంతపురం నుండి విచ్చేసిన ఎమ్మెల్యే రాజుకు స్థానిక కూటమి నాయకులు ఆర్ అనంతపురం గేటు వద్ద గజమాలతో ఘనంగా స్వాగతం పలుకుతూ, బాణా సంచాలు పేలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద ఉన్న వాల్మీకి , ఎన్టీఆర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలాజీ నగర్ లో ఉన్న మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి ఇంటి వద్ద నాయకులు ఏర్పాటుచేసిన వేడుకలకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు హాజరయ్యారు. తదనంతరం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు క్యాంప్ కార్యాలయం లో కూటమి నాయకులుఏర్పాటు చేసిన వేడుకలలో భాగంగా పలువురు నాయకులు ఆయనకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 44 కేజీల కేకును ఆయన నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, ఆగ లి జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు, కూటమి నాయకులు, క్లస్టర్ ఇంచార్జిలు, భూత్ ఇన్చార్జులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భగీరథ మహర్షికి జిల్లా బీసీ సంక్షేమ అధికారుల ఘన నివాళి



అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ : భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఆదివారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిడి కుష్బూ కొఠారి ఆధ్వర్యంలో ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షి విగ్రహానికి డిడి కుష్బూ కొఠారి, ఏబీసీడబ్ల్యూ ఓ లు సుభాషిని, రంగమ్మ, సూపరిండెంట్ నాగరత్నమ్మ, వార్డెన్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మస్తాన్, జిల్లా అధ్యక్షులు మారుతి ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఠాగూర్, పలువురు వార్డెన్లు, కార్యాలయ ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భగీరథ మహర్షి జయంతి ఉత్సవానికి విచ్చేసిన ఉప్పర సంఘ నాయకులకు, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు.

# ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు జన్మదిన శుభాకాంక్షలు



మడకశిర మేజర్ న్యూస్:మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే యువ నాయకుడు నియోజకవర్గ ప్రజల ఆశాజ్యోతి ప్రజల మనిషి అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడే ప్రజా నాయకుడు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు జన్మదిన వేడుకలు మడకశిర పట్టణంలో ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా.. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు వ్యక్తిగత సహాయకులు అయిన రవి తన కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే పార్టీ క్యాంపు కార్యాలయానికి విచ్చేసి ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు శాలువా కప్పి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు కూడా సంతోషం వ్యక్తపరుస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

# నీటి తొట్టెల నిర్మాణాలు.. ఎక్కడా కనిపించని ఆనవాళ్లు

## - మూగజీవాలపై అధికారుల కర్కశత్వం..

ఉరవకొండ మేజర్ న్యూస్ : మండలంలో మూగజీవాలపై అధికారులు కర్కశత్వం ప్రదర్శిస్తున్నారు. వేసవిలో పశువులు, మూగజీవాల దాహార్తిని తీర్చడానికి ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం నీటి తొట్టెలు మంజూరు చేసింది. గ్రామ పంచాయతీల వారీగా ఆమిద్యాల 4, రాకెట్ల1, రేణుమాకులపల్లి1, షేక్షానిపల్లి 3, వ్యాసాపురం 2, నెరమెట్ల2, నింబగల్లు 2, ఇంద్రావతి 1, పెద్ద కౌకుంట్ల 1, రాయంపల్లి 1, ఉరవకొండకు 1 చొప్పున 19 నీటి తొట్టెలు మంజూరయ్యాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామాల్లో 13 నీటి తొట్టెలు అవసరమని పశుసంవర్ధక శాఖ గుర్తించగా, ఉపాధి అధికారులు అదనంగా మరో 6 పశువుల తొటెలను సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. అయితే మంజూరైన నీటి తొట్టెల నిర్మాణ పనులు ఎక్కడా కనిపించని ఆనవాళ్లుగా మిగిలిపోయాయి. పశు గ్రాసం కరువైన ప్రస్తుతం పరిస్థితుల్లో కనీసం మూగజీవాల దాహార్తిని తీర్చలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని పశుపోషకులు సైతం వాపోతున్నారు. మూగజీవాల దప్పిక తీర్చడం తమకేమి పట్టనట్టు మండల అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. జిల్లా అధికారులు పశువుల తొట్టెల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నా, స్థానిక అధికారులు మాత్రం వాటి ఏర్పాటును గాలికి వదిలేశారు.



ఇప్పటిదాకా గ్రామాల్లో ఒక్కటంటే ఒక్క నీటి తొట్టె నిర్మాణాలకు నోచుకోలేదంటే అధికారులు పశువుల పట్ల ఎంతటి కర్కశత్వం ఉందో అర్థమవుతోంది. నెరమెట్ల 2 , షేక్షాన్ని పల్లి 1, వ్యాసాపురం 1 చొప్పున 4 పశువుల తొట్టెలు పురోగతిలో ఉన్నట్లు ఉపాధి అధికారులు అంకెల గారడి ప్రదర్శిస్తున్నారే గాని క్షేత్రస్థాయిలో ఆరా తీస్తే నిర్మాణ పనులు చేపట్టిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి పశువుల తొట్టెల నిర్మాణాలకు సత్వర చర్యలు చేపట్టాలని పశుపోషకులు కోరుతున్నారు. **వివరణ..** పశువుల తొట్టెల పురోగతిపై ఏపీవో విమల ను వివరణ కోరగా క్షేత్ర సహాయకులను అడిగి వివరాలు చెబుతానన్నారు.

# జె.సి.ప్రభాకర్ రెడ్డి విమర్శలను ఖండించిన సిపిఎం

## - గత వైసీపీ పాలనలో కార్మిక సమస్యలపై తాడిపత్రి లో మేము చేసిన పోరాటాల్లో మీరు పాల్గొన్నది నిజం కాదా - రాంభూపాల్ దంపతులకు ఒకటిన్నర సెంటు ఇల్లు, వెయ్యి రూపాయల బ్యాంకు అకౌంట్ తప్ప ఎలాంటి భూమి, డబ్బు ఎక్కడున్నా మీరే దానం చేయండి..

**అనంతపురము మేజర్ న్యూస్ :** శనివారం సాక్షి ఛానల్ చర్చలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్ మాట్లాడిన అంశంపై జె.సి. ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను సిపిఎం జిల్లా కమిటీ ఖండించింది. అధికారంలో ఎవరున్నా ప్రజల తరపున పోరాడడం, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎదిరించడం సిపిఎం విధానమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప తెలిపారు. గణేనాయక్ భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి. రాంభూపాల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల రంగయ్య తో కలిసి మాట్లాడారు. టీవీ చర్చలో రాంభూపాల్ మాట్లాడిన విషయంపై జె.సి. ప్రభాకర్ రెడ్డి స్పందిస్తూ గతంలో తాడిపత్రి లో వైసీపీ చేసిన అక్రమాలు కనిపించలేదా అని ప్రశ్నించారు. గతంలో పెద్దారెడ్డి మీ ఇంటికి వచ్చి దౌర్జన్యం చేసినప్పుడు అందరికంటే ముందు విమర్శించింది నాటి సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అనే విషయం గుర్తించాలన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ తరుపున కూడా ఆనాడు ఖండించడమే కాక, జిల్లాలోని వామపక్ష పార్టీలు కలిసి వైసీపీ ని విమర్శించామన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలను పోటీ చేయనీయకుండా వైసీపీ ప్రభుత్వం అడ్డుకుంటున్న సమయం లో తాడిపత్రి నియోజకవర్గం లో పెద్దవడుగూరు జెడ్ పి టి సి, తాడిపత్రి రూరల్, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో ఎనిమిది ఎంపీటీసీలకు సిపిఎం పోటీ చేసిందని గుర్తు చేశారు. తాడిపత్రి మున్సిపాల్టీ లో కౌన్సిలర్ గా సిపిఎం తరుపున పోటీ చేసిన అభ్యర్థి భర్తను ఎన్ని రకాలుగా బెదిరించినా పోటీ నుండి తప్పుకోని విషయం మీకు తెలియదా?. మునిసిపాలిటీ, ఆల్విన్, ఆశ కార్మికులు చేసిన పోరాటాల్లో మీరు, రాంభూపాల్ తో కలిసి పాల్గొన్న విషయం తాడిపత్రి కార్మికులు, ప్రజలకు మరచిపోరు. వైసీపీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం మేడే సందర్భంగా తాడిపత్రి లో పెద్ద ప్రదర్శన చేస్తే మీరు



రాంభూపాల్ తో కలిసి పాల్గొన లేదా? అప్పుడు మీతో మ్యాచ్ ఫిక్సింగ్ అయినట్లా? ఫిక్సింగ్ ల అలవాటు సిపిఎం కు వుందని మీ దగ్గర ఆధారాలుంటే బయట పెట్టాలన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న చట్టబద్ధంగా ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రజా సమస్యలు పరిష్కరించాలని, జిల్లా అభివృద్ధి కావాలని పోరాడటమే మా విధానం అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ మాట్లాడుతూ మేము గతంలో ఏమి చేసామో మీకు గుర్తు లేకపోయినా ఈ సంవత్సరం జనవరి 1న తాడిపత్రిలో మీరు నిర్వహించిన మహిళ కార్యక్రమం పై మీ మిత్రపక్షం బీజేపీ మిమ్మల్ని విమర్శించినప్పుడు మీ పార్టీ కంటే ముందుగా ఖండించింది మేమే అని గుర్తు చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకు అనంతపురం లో మీకు చెందిన బస్సు తగలబడితే సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని జిల్లా పోలీసు అధికారులను కోరింది సిపిఎం గా మేమే అన్నారు. ఎవరిపై వ్యక్తిగతంగా మాట్లాడేటువంటి స్వభావం మాకు లేదు. నా ఆస్తుల వివరాలను బయటపెడతామని మీరు చెప్పడాన్ని నేను స్వాగతిస్తు న్నాను నాతో పాటు, నా భార్య బ్యాంకు, ఆధార్ కార్డు వివరాలు మీకు పంపుతున్నాను, ప్రస్తుతం నివాసం వున్న ఒకటిన్నర సెంట్ ఇల్లు తప్ప మా పేరుతో భూ మండలంలో ఎక్కడైనా ఎలాంటి ఆస్తి వున్నా, బ్యాం కులో వెయ్యి రూపాయల కు మించి డబ్బులు వున్నా మీ ఇష్టం వచ్చిన వారికి దానం చేయని జె.సి. ప్రభాకర్ రెడ్డి కి విజ్ఞప్తి చేశాడు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి : ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, మేజర్ న్యూస్: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగ పర్చుకోవాలని ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. కిమ్స్ సవేర ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ పాల్ స్కూల్ ఆవరణలో మాజీ కౌన్సిలర్ పొరాళు పురుషోత్తం , ఆయన సతీమణి పొరాళు గౌరి సహకారం తో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏదైనా జబ్బు చేసినప్పుడో, ఆరోగ్య సమస్య వస్తేనో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించు కోవడం తో పాటు ఉచిత శిబిరాలు నిర్వహించినపుడు సాధారణంగా బీపీ, ఇతరత్రా చిన్న వ్యాధులకు పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. వైద్యుల సిఫార్సు మేరకు తదుపరి పరీక్షల్లో పూర్తి వ్యాధి నిర్ధారణ జరుగుతుందన్నారు. అప్పుడు అవసరమైన వారికి సరైన వైద్యం, ఆపరేషన్లు చేయటానికి వీలవుతుందన్నారు. కావున ప్రజలు ఉచిత



వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరం లో 475 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు పొరాళు పురుషోత్తం తెలిపారు. ఈ కార్యక్రమంలో సవేరా వైద్య బృందం తో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపు లేటి నాగరాజు , వార్డు ఇంచార్జులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవం ప్రారంభం

**- ఆలయ ఈవో వెంకటేశులు, అడహక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణములోని బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయములో లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవముల వేడుకలు అత్యంత వైభవంగా ఆదివారం సాయంత్రం నిర్వహించడం జరిగిందని ఆలయ ఈవో వెంకటేశులు, అడహక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం ఆలయం నుండి ఉభయ దాతలైన గజనాన్ని పట్టుసాలే సంఘం- సెమీ నారాయణ స్వామి దేవాలయం వరకు మేళ తాళాలతో చేరుకున్నారు. అక్కడ వివిధ పూజలు ముగిసిన తర్వాత తిరిగి చెన్నకేశవ స్వామి ఆలయమునకు చేరుకున్నారు. తదుపరి వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ గజ నాణ్య పట్టు సాలే వారు తెచ్చిన గరుడ ఆహ్వాన చిత్రపటాన్ని ప్రత్యేక పూజలను అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భాను ప్రకాష్ చక్రధర్లు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ పద్ధతిలో ఉభయ దాతలు నడుమ ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించబడును అని తెలిపారు. అంతేకాకుండా ప్రతిరోజు స్వామి వారిని వివిధ వాహనాల ద్వారా పూజలు నిర్వహించిన తరుపతి పట్టణ పురవీధులలో ఊరేగింపు కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామని తెలిపారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాల్ల పుల్లయ్య వారి శిష్య బృందం ఆలపించిన కేరళ వాయిద్యం, అన్నమయ్య సంకీర్తనలు భక్తాదులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తాదులు, ఆలయ సిబ్బంది రామశాస్త్రి, మల్లికార్జున, కిట్టప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భగరీథ జయంతి

**-ముఖ్య అతిథిగా వెంకటేశ్వరరావ్ రాక**



**సోమందేపల్లి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో ఆదివారం భగీరథ జయంతి ఘనంగా జరిగింది. మాజి జెడ్పిటిసి వెంకటరాముడు, లోకేంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. స్థానిక కొత్తపల్లి క్రాస్ వద్ద ఉన్న భగీరథ సర్కిల్ లోని భగీరథ విగ్రహానికి సీనియర్ తేదేపా నాయకులు, మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మాజి జెడ్పిటిసి వెంకటరాముడుకి తినిపించారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్య అతిథులకు లోకేంద్ర శాలువలు కప్పి, పూల మాలలు వేసి, జ్ఞాపికలు అందించారు. అనంతరం మాజి జెడ్పిటిసి వెంకటరాముడు మాట్లాడుతూ అపర భగీరథుడి పండుగను రాష్ట్ర పండుగగ కూటమి ప్రభుత్వం జీఓ జారీ చేయడం ఆనందించదగ్గ విషయమని, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యుటి సియం పవన్ కళ్యాణ్, మంత్రి సవితకు ధన్యవాదాలు తెలిపారు. వెంకటరమణ, తెదేపా నాయకులు వెంకటేశ్వరరావ్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధితో పాటు పలు కులాలకు గుర్తింపు రావాలని, రాజకీయంగా, ఆర్థికంగా అందరు ఎదగాలనే సంకల్పంతో పలు కులాల పండుగలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ఘనత సియం చంద్రబాబు అని, గత పాలకులు అన్ని కులాలను నిర్వీర్యం చేసారని, వైసిపి పాలనలో రాష్ట్రం కుదేలైందన్నారు. నేడు ఉప్పర సగర కులస్థుల కుల బాంధవుడు అయిన భగీరథుడి జయంతిలో నేను పాల్గొనడం సంతోషంగ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పర సగర కులస్థులు, కూటమి నేతలు, మహిళలు పాల్గొన్నారు.

## కార్యకర్తను పరామర్శించిన మాజీ మంత్రి ఉషశ్రీ



**సోమందేపల్లి, మేజర్ న్యూస్** :మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం లో వైసిపి కార్యకర్త, దాదాపీర్ అనారోగ్య కారణం గా ఇబ్బందికి గురై శస్త్ర చికిత్స చేయించు కోవ డం తో రాష్ట్ర మాజీ మంత్రి, వైసి పి జిల్లా అధ్యక్షురాలు, పెను కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ తదితరులు తన స్వగృహానికి వెళ్లి దాదాపీర్ ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గజేంద్ర, సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, మండల వైసిపి నాయకులు, బ్రాహ్మణపల్లి యువత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద అన్నదానం



**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్,** మడక శిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పుట్టినరోజు సందర్భంగా నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద కురుబ నారాయణస్వామి ఆధ్వ ర్యంలో అన్నదాన కార్య క్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పుట్టినరోజును అత్యంత వైభవంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. నారాయణ సేవలో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెస్ రాజుకు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు ఆయన తెలియజేశారు..

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

**- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.**
**-మీడియా సమావేశం లో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు.**



**మడకశిర మేజర్ న్యూస్:** ఎన్నికల హామీల లో భాగంగా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు తెలిపారు. స్థానిక పట్టణంలోని ఎమ్మె ల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీలను నెరవేరుస్తానని, ఎన్నికలలో నన్ను నమ్మిన ఓటేసిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. నియోజకవర్గంలో ఒక రిజర్వాయర్ ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. నియోజకవర్గంలో వక్క మార్కెట్ ఏర్పాటుకు, అదేవిధంగా ప్రజలకు 20వేల ఇళ్ల నిర్మాణానికి తగిన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం సోలార్ పార్క్ కోసం 7500 కోట్లతో ప్రారంభిస్తున్నామన్నారు. అదేవిధంగా వ క్క మార్కెట్ నిర్మాణానికి త్వరలోనే భూమి పూజ చేస్తామన్నారు. గార్మెంట్స్ ఫ్యాక్టరీలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి మహిళలకు, స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని అదేవిధంగా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే విధంగా ప్రయత్నిస్తానన్నారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న అన్ని శాఖల అధికారులకు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ధన్యవాదాలు తెలుపుతూ, నా ఊపిరి ఉన్నంతవరకు మడకశిర ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు తెలిపారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మామిడి రైతులను ఆదుకోవాలి

**-ఏపీ రైతు సంఘం**



**ధర్మవరం మేజర్ న్యూస్:** సత్యసాయి జిల్లాలో రెండు రోజులక్రితం గాలి వానకు దాదాపు 1000 ఎకరాలలో మామిడి పంటకు నష్టం వచ్చిందని, కావున మామిడి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జం గాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రైతుసంఘం కార్యాలయం లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...లక్షలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన మామిడి పంట గాలివానకు నేలరాలి లక్షలాది రుపాయి లు నష్టపోయారన్నారు.వెంటనే ఉద్యానవన అధికారులు జిల్లా వ్యాప్తంగా పంట నష్టాన్ని అంచనా వేసి మామిడి తోట రైతులను ఆదుకోవాలని అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటిసభ్యులు మారుతి, సీఐటీయూ ఏసొచ్చాఆషా, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీరమణ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం, కారు ఢీ.. మహిళ మృతి



**చెన్నేకొత్తపల్లి, మేజర్ న్యూస్:** ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఒక మహిళ అక్కడ మృతి చెందిన ఘటన 44 జాతీయ రహదారిపై ద్యామాజిపల్లి సమీపన చోటు చేసు కుంది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు, అనంతవరం చెంది న,మున్ని, (30)సం,, భర్త యాజన్ హుస్సేన్ భాష, పెనుగొండ దర్గాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో,చెన్నె కొత్తపల్లి సమీపంలోని 44 నెంబర్ జాతీయ రహదారిపై దామాజీపల్లి వై జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని, వెనకనుంచి, కారు ఢీ, కొట్టింది, ఈ ప్రమాదంలో, మున్ని, అక్కడక్కడ, మృతి చెందగా మరొకరు గాయపడ్డారు, మృతి చెందిన వారిని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

## చేనేతకు రూ.60వేలు ఆర్థిక చేయూత

**అనారోగ్యంతో నేత కార్మికుడు చంద్రశేఖర్ మృతి, బాధాకరం**
**అండగ మేమున్నాం అని భరోసా ఇచ్చిన చేనేతలు**



**సోమందేపల్లి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రానికి చెందిన చేనేత చంద్రశేఖర్ (49) అనారోగ్యంతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న చేనేత కులస్థులు ఒక్కటై చంద్రశేఖర్ ఇంటికెళ్ళి అతని భౌతిక కాయానికి నివాళు లర్పించారు. చిన్నపుటి నుండి చేనేత కులాన్నే నమ్ముకుని జీవిస్తున్న చంద్రశేఖర్ కుటుంబం ను ఓదార్చారు. చంద్రశేఖర్ కుమార్తె గంగోత్రి పాపిరెడ్డిపల్లిలోని కెజిబివి లో పదవ తరగతిలో ఉత్తీర్ణురాలు అయిందని, 600/520 మార్కులు సాధించిందని తెలుసుకుని, చంద్రశేఖర్ భార్యతో వారి పిల్లలకు మంచి చదువు చెప్పిస్తామని హామీ ఇచ్చారు. నేత కార్మికుడిగ ఎన్నో కష్టనష్టాలు చుసి చివరికి చంద్రశేఖర్ అనారోగ్యంతో మరణించడం బాధాకరమన్నారు. నేసే కులస్థులు, తమ వంతు సహాయంగ 60,000 వేలు అందించి, ఆ కుటుంబానికీ అండగ ఉంటామని మీ కుటుంబ సభ్యులుగా మేం తోడుంటామని అభయమిచ్చారు తొగటవీర క్షత్రియ సంఘం సభ్యులు. ఈ కార్యక్రమంలో తొగట, దేవాంగం, పద్మశాలీలు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరమునకు విశేష స్పందన

**-షిరిడి సాయిబాబా సేవాసమితి అధ్యక్షులు వీరనారాయణ**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు, సాయి నగర్ లో గల షిరిడి సాయిబాబా దేవాలయంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన రావడం జరిగిందని షిరిడి సాయిబాబా సేవ సమితి అధ్యక్షులు వీరనారాయణ కార్యదర్శి రామలింగయ్య, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, బంధనాథం సూర్య ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరానికి 135 మంది కంటి పరీక్షల కొరకు రాగా అందులో 50మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. శిబిరానికి వచ్చిన అందరికీ భోజన వసతి కూడా కల్పించడం జరిగిందన్నారు. ఈ శిబిరం ధర్మవరం శ్రీ శిరిడి సాయిబాబా సేవాసమితి, కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీ సత్యసాయి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచిత వసతి తో పాటు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. కంటి నిపుణుల సలహాలతో కంటికి ఉచిత లెన్స్ కూడా అమర్చబడునని వారు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం పట్ల సాయిబాబా సేవా సమితి వారు అందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి కడప వైద్యులు, సిబ్బంది, బాబా ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏళ్లు గడిచినా మరమ్మతులకు నోచుకొని రోడ్లు



మడకశిర రూరల్ మేజర్ న్యూస్: మడకశిర మండల పరిధిలో గల తడకలపల్లి నుండి ఎల్లోటి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారయింది.తారు రోడ్డు కూడా మట్టి రోడ్డు లాగా కనిపిస్తున్నాయి.పలు చోట్ల గుంతలు పడి రాళ్లుతేలి ఉన్నాయి మరికొన్నిచోట్ల తారంత లేచిపోయి మట్టి రోడ్డు కంటే హీనంగా తయారైంది దీంతో ఆయా ప్రాంతాల పాదాచార్యులు ద్విచక్ర వాహన చోదకులు.రోడ్డుపై తేలిన రాళ్లపై నుంచి వెళ్లలేక కిందపడి గాయాల పాలైన సందర్భాలు అనేకం ఉన్నాయి అంతే కాకుండా గుంతల మాయమైన రోడ్డు వలన ఆటోలు గ్రామాలకు రావడం లేదని ఆసుపత్రులకు గర్భిణీలు వృద్ధులు అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లవలసిన వారు నాన ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి గుంతల రోడ్డు సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల గ్రామస్తులు కోరుతున్నారు

# ఎమ్మెల్యే బాలకృష్ణ సన్మాన కార్యక్రమానికి తరలిన నాయకులు



చిలమత్తూరు, మేజర్ న్యూస్ : హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా పద్మభూషణ్ అవార్డు అందుకోవడం జరిగింది. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభి మానులు కలిసి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆదివారం హిందూపు రంలో ఎంజీఎం గ్రౌండ్ లో సన్మానం కార్యక్రమం నిర్వ హించగా, చిలమ త్తూరు మండలం నుంచి సీనియర్ నాయకులు నాగరాజ్ యాదవ్, లక్ష్మీ నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రత్యేక వాహనాలలో తరలి వెళ్లడం జరిగింది. తరలి వెళ్లిన వారిలో ఎక్స్ ఎంపీపీ గౌరీ స్వామి, ఎంపీటీసీ నాగరాజు, వార్డు మెంబర్లు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

# గాండ్లపెంట గంగా భవాని అమ్మవారి ఉత్సవాలు వాయిదా



గాండ్లపెంట, మేజర్ న్యూస్:మండల కేంద్రంలోని గంగాభవాని అమ్మ వారి ఉత్సవాలను ఈనెల 9 నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా ఆలయ అర్చకులు వెంకట రమణ కుమారుడు రోడ్డు ప్రమాదం లో మరణించడం తో ఉత్సవాలు వాయిదా వేయడం జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 16,17,18 తేదలలో తిరుణాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గాండ్లపెంట గంగాభవాని అమ్మ వారి ఉత్సవాలు మార్పు విషయాన్ని మండల ప్రజలు భక్తులు గమనించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



గాండ్లపెంట,మేజర్ న్యూస్: మండల కేంద్రానికి చెందిన మారుతీప్రసాద్ గత రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సందర్భంగా మారుతి ప్రసాద్ పిల్లల చదువు కొరకు పూర్తి సహకారం అందిస్తా నని, ఆర్థికంగా సహకారం అందిస్తానని అదేవిధంగా తెలుగుదేశం పార్టీ తరపున పూర్తిస్థాయి లో కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సీ.ఎం కొండయ్య, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు వెంకట రమణారెడ్డి, స్థానిక సర్పంచ్ రహమ తుల్లా,సర్పంచ్ శివప్ప నాయుడు,సర్పంచ్ సిద్దార్థ్ రెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మీ నరసారెడ్డి, అక్రం బాషా, దొనకొండ ఆనంద్, చిన్నోడు, బుసన గారి సూర్య శేఖర్ రెడ్డి, డీలర్ బాబు, బోర్వెల్స్ రవి, ఐ టిడిపి పవన్ ,సన, హేమంత్ రెడ్డి , పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు జన్మదిన వేడుకలు..



మడకశిర మేజర్ న్యూస్: స్థానిక పట్టణంలోని బాలాజీ నగర్ లో ఉన్న తెదేపా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు 44వ జన్మదిన వేడుకలు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిజెపి కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్చార్జ్ చంద్రశేఖర్ గజమాలతో ఎమ్మెస్ రాజుకు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలాజీ నగర్ నుండి నాయకులు కలిసి ర్యాలీగా వెళ్లి మధు గిరి రోడ్డు వద్ద ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో కూటమి నాయకులతో కలిసి 45 కేజీల ల కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. . ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి., బిజెపి కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ ఎస్.చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, నియోజకవర్గ కూటమి నాయకులు, ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బోయలను ఎస్టి జాబితాలో చేర్చాలని పోస్ట్ కార్డుల ఉద్యమం



గాండ్లపెంట ,మేజర్ న్యూస్: మండలంలోని మద్దివారి గొంది, గాండ్లపెంట,రెక్కమాను గ్రామాలలో రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు క్రిష్ణమూర్తి వాల్మీకి ఆదేశాల మేరకు ఆదివారం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ధోనికొండ ఆనంద్ , రాష్ట్ర అధికార ప్రతినిధి మేకల శివప్రసాద్ పోస్ట్ కార్డుల ఉద్యమ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దోనికొండ ఆనంద్ మాట్లాడుతూ 2019లో కర్నూల్ మహాసభ లో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాటిచ్చారని, వారు ఆ మాట నిలబెట్టుకో వాలని పోస్ట్ కార్డుల ద్వారా అభ్యర్థిస్తు న్నామని తెలియ జేశారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని వాల్మీకి బోయల విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,15,341,342, 29 (డి ) లు అమలు కావడం లేదని రాజ్యాంగ ఉల్లంఘన జరిగిందని ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ చొరవతో మా సమస్యను పరిష్కరించాలని, ఈ పోస్టుకార్డ్స్ ఉద్యమం కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దొనకొండ ఆనంద్ , రాష్ట్ర అధికార ప్రతినిధి మేకల శివప్రసాద్ ,ఆర్ వి ఎస్ ఎస్ గాండ్లపెంట నాయకులు ఆదిభ యన్న ,శంకర, శివయ్య, శివ, నరసింహులు, రామాంజనేయులు, ప్రహ్లాద, యుగంధర్, శిరీష, సాంబ, నవీన్, రామలక్ష్మమ్మ, నవనీత తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో విగ్రహాల పునః ప్రతిష్ట..



ముదిగుబ్బ, మేజర్ న్యూస్ : గ్రామ పెద్దల ఆధ్వ ర్యంలో ఆదివారం మండల పరిధిలోని బి. కొట్టాల గ్రామంలో శ్రీ సీతారామ, లక్ష్మణ, హనుమ సమేత విగ్రహాల పునః ప్రతిష్ట కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించిన రథముపై ఉంచి, భక్తుల కోలాటం, యక్ష గానాలను స్తుతిస్తూ గ్రామంలో ఊరేగించా రు. అనంతరం వేద పండితుల వేదమం త్రాలను ఉచ్చరణల మధ్య అత్యంత కమనీయంగా సీతా రాముల కల్యాణ వేడుకలను నిర్వహిం చారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు హెూమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసా దాలు అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విగ్రహాల పునః ప్రతిష్ట సీతారాముల కల్యాణ వేడుకలకు వందలా దిగా భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో తిలకించారు. స్వామి వార్లకు ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ పట్టు వస్త్రాలు సమర్పిం చారు. భారతీయ సంస్కృతి సాంప్రదా యాలలో అత్యంత ప్రాముఖ్యమైన వ్యక్తిత్వం కలిగిన శ్రీరాముని జీవితం అందరికీ ఆదర్శమని అన్నారు. దేవాల యాలు హిందూ సంస్కృతి సాంప్రదా యాలకు, ఆచార వ్యవహారా లకు ప్రతి బింబాలని, మహెూన్న తమైన హిందూ సంస్కృతి సాంప్రదా యాలను భావితరా లకు అందించే వారదులని, వాటిని పరిరక్షించడం మన అందరి బాధ్యత అన్నారు. విగ్రహాల పున ప్రతిష్ట, సీతా రామ కళ్యాణ వేడుకలు సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. స్థానికుల తోపాటు చుట్టుపక్క ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ఈ కమనీయ కార్యక్ర మాన్ని తిలకించారు.

# ఘనంగా, భగీరథ మహర్షి జయంతి వేడుకలు



హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం స్థానిక భగీరథ సర్కిల్ లో భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా మునిసిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప భగీరథ విగ్రహానికి పూలమలలు వేసి జయహెూ భగీరథ జయహెూ భగీరథ అని నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భగీరథ మహర్షి తపస్సు ద్వారా ధివి నుండి భువి కి గంగను తెప్పించాడని మనం ఏ కార్యక్రమాన్ని అయినా చేపట్టినప్పుడు విజయం చేకూరే వరకు ప్రయత్నిస్తూ, చివరిగా విజయాన్ని పొందితే ఆ విజయాన్ని భగీరథ ప్రయత్నంతో పోలుస్తుంటామని, అదేవిధంగా ఎమ్మెల్యే బాలకృష్ణ గొల్లపల్లి నుండి హిందూపురంకి నీళ్లు తెప్పించి పుర ప్రజల గుండెల్లో భగీరథునిగా నిలిచిపోయారని అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకట నారాయణ, కదిరప్ప, రామప్ప, శ్రీరామప్ప, అంజినప్ప, బసప్ప, లింగారెడ్డి పాల్గొన్నారు.

# వాసవి మాత విగ్రహ ప్రతిష్టాపన



మడకశిర మేజర్ న్యూస్: సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్నను హిందూపురం పట్టణం కనకాపరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది.ఈ సందర్భంగా.. ఆదివారం రోజు పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాసవి మాత బంగారు విగ్రహ ప్రతిష్టాపన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈరన్న మాజీ ఎంపీపీ, ఆదినారాయణ, చత్రం శివరామకృష్ణ,రంగనాథ్,ఆలయ కమిటీ చైర్మన్, జె,పి,కే. రాము,తదితరులు పాల్గొన్నారు.

# ఎంజెపిలో ప్రశాంతంగా పరీక్షలు



లేపాక్షి మేజర్ న్యూస్: లేపాక్షి మండల కేంద్రం లో మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల లేపాక్షి పాఠశాల యందు 2025-26 విద్యా సంవత్సరం కు గాను జరిగిన ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష నందు 701 మంది విద్యార్థులకు గాను 411 మంది విద్యార్థులు హాజరు కాగా 290 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులకు తాగునీటి సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్ష జరిగిందని ప్రిన్సిపాల్ పి ఆర్ సుందర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం

కదిరి, మేజర్ న్యూస్: పట్టణ సమీపంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న శ్రీ మారెమ్మ తల్లి, శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి ఆదివారం వైసీపీ రాష్ట్ర బీసీపీ భాగం ఉపాధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్ లక్ష రూపాయలు విరాళం అందజేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆదివారం దేవస్థానం వద్దకు వెళ్లి పనుల పరిశీలన చేసి పూజల్లో పాల్గొన్నారు. ఆపై ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కృష్ణా నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, నాయక్, సర్పంచ్ రవి నాయక్,వీరే నాయక్, శ్రీనివాసులు నాయక్, బాబా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



# కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుంది

## – వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి – ర్యాలీగా వెళ్లి అనంతను సత్కరించిన మహ్మద్ ఆసిఫ్

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడుతున్న ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని.. పార్టీ పటిష్ఠకు కృషి చేయాలని వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం నగర అనుబంధ విభాగాలలో నియమితులైన మైనార్టీ విభాగం అనంతపురం నగర ఉపాధ్యక్షులు ఆలూరు మహ్మద్ ఆసిఫ్ ఆధ్వర్యంలో యువజన విభాగం నగర ప్రధాన కార్యదర్శి నందిస్, ఎస్సీ సెల్ నగర కార్యాదర్శి మద్దెల కార్తీక్ కుమార్, సోషియల్ మీడియా జనరల్ సెక్రటరీ ఇద్రీష్‌తోపాటు పెద్ద ఎత్తున యువకులు ర్యాలీగా జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్వగృహానికి చేరారు. డప్పు వాయిద్యాలతో, బాణాసంచాలతో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి గజమాల తో ఆసిఫ్ సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడు తూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, కూటమి నేతలు సాగిస్తున్న అరాచక పాలనను గురించి ప్రజల్లోకి తీసుకెళ్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తుంపు తప్పకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు చింత సోమశేఖర్ రెడ్డి, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షులు ఎద్దుల అమర్నాథ్ రెడ్డి, మైనార్టీ నాయకులు కాగజ్ ఘర్ రిజ్వాన్, క్యాన్ నియాజ్, కార్పొరేటర్లు సైదుల్లా బేగ్, రహంతుల్లా తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



# పల్లెనిద్ర.. గ్రామ సందర్శన ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు

పుట్టపర్తి క్రైమ్ మేజర్ న్యూస్: శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజలతో భాగస్వాములయ్యేలా కార్యాచరణ రూపకల్పన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా పల్లెనిద్ర గ్రామ సందర్శన , శక్తి టీం బృందాలు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలా పాలు అడ్డుకట్టు వేసేందుకు ఆయా గ్రామాలలోని గ్రామస్తులు, గ్రామ పెద్దలు, మహిళలు బాలికలు, మరియు యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లాలోని పుట్టపర్తి ,కదిరి, హిందూపురం, ధర్మవరం, పెనుగొండ సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు ఎస్ఐలు తమ సిబ్బందితో కలిసి గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలోని సమస్యలు, నేరాలు, నివారణ చర్యలు, సైబర్ మోసాల గురించి, గంజాయి, ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణ, శక్తి యాప్ ,గురించి, మహిళలు మరియు బాలబాలికల పై జరిగే నేరాలు, ఇతర చట్టాలు, శిక్షలు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకొచ్చే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు ఎటువంటి , గొడవలు పడరాదని, అందరూ కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించాలని సూచిస్తున్నారు. ఆయా పరిధిలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా. చెడునడత, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న రౌడీషీటర్స్ ట్రబుల్ మాంగర్స్ కు పోలీస్ అధికారుల కౌన్సిలింగ్ నిర్వహిస్తూ మంచి నడవడికతో నడుచుకోవాలని తెలియపరుస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. రాత్రి వేళల్లో గస్తీలు నిర్వహించి ఏటీఎం బ్యాంకు వద్ద, బందోబస్తు చర్యలు చేపట్టారు, ఆర్టీసీ బస్టాండ్ రైల్వే స్టేషన్లో అనుమానిత వ్యక్తుల వివరాలను ఆరా తీశారు. నిరంతరం సత్యసాయి జిల్లాలో శాంతి పద్ధతులపై ప్రత్యేక దృష్టి సారించారు.



### వైసిపి స్థూపాన్ని అక్రమంగా తొలగించారని

# నాయకుల నిరసన

హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం పట్టణంలోని రహమత్పూర్ సర్కిల్ నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థూపాన్ని కూటమి ప్రభుత్వం అక్రమంగా తొలగించారని వైసీపీ నేత గుడ్డంపల్లి వేణు రెడ్డి ఆధ్వర్యంలో రహమత్పూర్ సర్కిల్ నందు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపురం ప్రాంత ప్రజల నీటి కష్టాలను తీర్చేందుకు దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి త్రాగునీటి పథకం కింద నీటిని తీసుకొచ్చిన గుర్తుగా స్థూపాన్ని రహమత్పూర్ సర్కిల్ నందు ఏర్పాటు చేశారన్నారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో శాంక్షన్ అయిన విద్యుత్ దీపాలను, హుటాహుటిన మున్సిపల్ అధికారులు వాటిని అమర్చి ఎమ్మెల్యే బాలకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించడం కోసం, వైయస్సార్ స్థూపాన్ని రాత్రికి రాత్రి అడ్డగోలుగా తొలగించారని మండపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైసీపీ నాయకులు కార్యకర్తలను కవ్వింపు చర్యలకు దారి తీస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలకృష్ణ కు పద్మభూషణ్ అవార్డు రావడం చాలా సంతోషకరమని వైఎస్ఆర్సిపి తరపున ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని వేణు రెడ్డి అన్నారు. పలువురు మున్సిపల్ అధికారులు ధర్నా కార్యక్రమం వద్దకు వచ్చి తొలగించిన స్థూపాన్ని యధా స్థానానికి నిలబెడతామని హామీ ఇవ్వడంతో ధర్నాని విరమించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## 7న వాసవి మాత జయంతి



కదిరిరూరల్, మేజర్ న్యూస్ : ఈనెల 7వ తేదీన పట్టణంలోని శ్రీ వాసవి కన్యాక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవి జయంతి వేడుక అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అందులో భాగంగా అన్ని ఆదివారం అమ్మవారిని మహాలక్ష్మి అలం కరణలో కొలువుతీచ్చారు. ఈ సందర్భంగా వారిని వివిధ పుష్పాలం కరణలతో భక్తులకు కనువిందు చేసేలా దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారి ఉత్సవాలు భాగంగా ఏడవ తేదీన అత్యంత వైభవంగా వాసవి అమ్మవారి జయంతినీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో పాల్గొన్న భక్తులకు చేపలు తీర్థప్రసాదాలు అందజేశారు.

## నవధాన్యాల సాగుతో పిఎండిఎస్ నేల సారవంతం



మడకశిర మేజర్ న్యూస్:శ్రీ సత్య సాయి జిల్లా డిపిఎం లక్ష్మణ్ నాయక్ సార్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఆమిదాల గొంది యూనిట్ ఆమిదాల గొంది గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో రైతు సునీత నారాయణ పొలంలో 6 ఎకరాల పొలంలో ఐదు పంటలు అయినా అనుములు, సజ్జ,ఆముదం అలిసెంద, 25 రకాల జీవవైవిద్య పంటలను ఘనజీవామృతంతో పాటు విత్తడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంటిఎల్ రమేష్ ఆ మిదాల గొంది యూనిట్ ఇన్చార్జి మంజునాథ్ మరియు కమ్యూనికేషన్ విభాగం నుండి మల్లీశ్వరి, కీర్తన మోడల్ ఫార్మర్ ఆర్ భాస్కర్ రెడ్డి, ఐ సి ర్ పీలు గోవిందప్ప, లోకేష్, మల్లికార్జున, హరికృష్ణ రంగనాథ్, ధనలక్ష్మి, నాగరాజు రైతులు తదితరులు పాల్గొన్నారు.

జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన
వారు ఎప్పు డైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళలా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం.
ఉమ్మడి అనంతపురం జిల్లాల
బ్యూరో అండ్ బ్రాంచ్ మేనేజర్
ఎన్. లక్ష్మీనారాయణ
ఫోన్ నెంబర్ : 63011 07116



### అధికారమే లక్ష్యంగా

# పార్టీని బలోపేతం చేద్దాం

## – వైసీపీ శ్రేణులకు మాజీ మంత్రి శైలజనాథ్ పిలుపు

సింగనమల పీసీ ఇంచార్జ్, మే 4 మేజర్ న్యూస్: అధికారమే లక్ష్యంగా వైసిపి పార్టీని కిందిస్థాయి నుండి బలోపేతం చేద్దామని సింగనమల నియోజకవర్గ కార్యకర్తలు, దిగువ శ్రేణి నాయకులకు మాజీ మంత్రి, వైకాపా సింగనమల ఇంచార్జ్ డాక్టర్ సాకే శైలజ నాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం వైఎస్ఆర్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ ని బుక్కరాయసముద్రం ఆ పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశాయి. వైయస్ఆర్సీపీ నాయకులు ముందుగా ఆయనకు శాలువా కప్పి పూల బుక్కేతో అభినందిం చడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సింగనమల వైకాపా ఇన్చార్జ్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడు తూ... రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ పార్టీ ని గెలిపించుకోవడమే లక్ష్యంగా పని చేయాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో. మాజీ సింగిల్ విండో చైర్మన్ గువ్వల వెంకటరెడ్డి , మాజీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు, బుక్కరాయసముద్రం మండలం అనంతసాగర్ కాలనీ వైయస్సార్ పార్టీ నాయకులు కప్పల సూర్యనారాయణ, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ కప్పల వరలక్ష్మి , వైయస్సార్ పార్టీ ఎస్సి మండల కన్వీనర్ వరి కూటి కాటమయ్య. కూల్లయమ్మ. కప్పల శివ. ఉదయ్. రామాంజి. వీరయ్య. మారుతి. సుధాకర. ప్రసాదు. చంద్ర. చాకలి మల్లి. తదితరులు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల సమ్మేళనం..ఆనందమయం



**గార్లదిన్నె, మేజర్ న్యూస్** పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలిశారు. ఆనందంగా చదువుకున్న రోజుల్లో చేసిన జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు. ఈ సంఘటన ఆదివారం గార్లదిన్నె జిల్లా పరిషత్ పాఠశాలలో చోటుచేసుకుంది. 2002 2003 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అందరూ ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకొని ఎవరెవరు ఏమేం చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కార్యక్రమాన్ని పిలిచి సన్మానించారు. 22 సంవత్సరాల క్రితం విద్యాబుద్ధులు నేర్చుకున్న శిశువులు తమను గుర్తు పెట్టుకొని కార్యక్రమానికి పిలిచి సన్మానించడంతో ఆ గురువుల సంతోషానికి అవధులు లేవు. ఈ కార్యక్రమంలో పూర్వ గురువులు రాంభూపాల్ రెడ్డి నారాయణరెడ్డి ఇషాక్ కలువు లత, వేణు ,శశిదేవి ఎలిజిబెత్, పూర్వ విద్యార్థులు ప్రతాప్ అనిల్, పావని,హసీనా, శివ, ఓబులేష్ నాయుడు ,శ్రీనాథ్ రెడ్డి రవి శేషుబాబు లింగమయ్య శ్రీకాంత్ రెడ్డి నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయండి

**- గురుస్వామి విజయ్ కుమార్, బండ్లపల్లి వెంకట జయప్రకాష్**

**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణంలోని కేశవ నగర్ నందు ఈ నెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు అయ్యప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవము విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవ వేడుకలకు ప్రజలు భక్తాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని దేవాలయ నిర్మాణ వ్యవస్థాపకులు గురు స్వామి పి జే. విజయ్ కుమార్, బండ్లపల్లి వెంకట జయప్రకాష్, కీర్తిశేషులు కలవల నాగరాజు కుటుంబ సభ్యులు, శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ట్రస్ట్ వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు దేశవ్యాప్తంగా అయ్యప్ప స్వామి యొక్క మహిమలు విస్తరించాయని, ఇందులో భాగంగా ఆ అయ్యప్ప స్వామి దేవాలయమును దాతలు, భక్తాదులు సహాయ సహకారములతో నిర్మాణం చేపట్టడం మాకెంతో ఆనందదాయకమని తెలిపారు. ఈ నెల 10వ తేదీ శనివారం మహాగణపతి పూజ యాజమాన్య సంకల్పం దీపస్థాపన తదితర కార్యక్రమాలు, 11వ తేదీ స్వస్తివాచనం, నవగ్రహ మంటపరాధనం, అగ్ని ప్రతిష్ట హెూమాలు కార్యక్రమాలు, సాయంత్రం మూలమూర్తుల గ్రామోత్సవం, 12వ తేదీ సోమవారం మోదక మహాగణపతి హెూమం పూర్ణాహుతి విష్ణు సహస్ర నామార్చనలు, 13వ తేదీ మంగళవారం ఆవాహిక దేవత హెూమములు గోపుర మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు, 14వ తేదీ బుధవారం యంత్ర ప్రతిష్ట విగ్రహ ప్రతిష్టాధులు తదితర కార్యక్రమాలతో పాటు మహా కుంభాభిషేకం అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట, సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కావున ఈ ఐదు రోజుల కార్యక్రమాలకు వందల సంఖ్యలో ప్రజలు భక్తాదులు పాల్గొనాలని తెలిపారు.







## ఘనంగా యోగేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**అనంతపురం విద్య మేజర్ న్యూస్** మాజీ ఎమ్మెల్యే బిఎన్నార్ సోదరి కుమారుడు యోగేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం బిఎన్నార్ కుటుంబ అభిమాని రుద్రంపేట అనిల్ వారి మిత్రబృందం ఆధ్వర్యంలో గొట్కూరులోని వృద్ధుల అనాధాశ్రమంలో అన్నదానం చేశారు. యోగేశ్వర్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



# మాజీ గ్రంథాలయ చైర్మన్‌కి జన్మదిన శుభాకాంక్షలు

**- తెలుగుదేశం మైనార్టీ నాయకుడు షౌకత్ ఖాన్**

**అనంతపురం సిటీ మేజర్ న్యూస్** ఈ రోజు అనంతపురం అర్బన్ నందమూరి బాల కృష్ణ ఫాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మాజీ గ్రంధాలయం చైర్మన్ జిరాయతి గౌస్ పుట్టినరోజు సందర్భంగా తెలుగుదేశం పార్టీ మైనారిటీ జిల్లా నాయకులు షౌకత్ ఖాన్ మరియు హరీష్ రెడ్డి , కరీముల్లా, మహేష్, చరణ్ తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమం లో అన్నా గారు ఆప్యాయత గా పలకరించే నాయకుడు తెలుగుదేశం పార్టీ శ్రేణులు, కార్యకర్తలను వెంటవుండి మోటివేట్ చేస్తూ పదవులు ఉన్నా లేకున్నా పార్టీ కోసం నిరంతరం కష్టపడుతూ పెద్దవారితో అనుగుణంగా చిన్నవారితో ప్రేమ అభిమానంగా ఉంటూ ముందుకెళ్తున్న నందమూరి బాలకృష్ణ విరాభిమానికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల సుఖ సంతోషలతో ఉండాలని, రాజకీయంగా ఎన్నో ఉన్నత స్థాయికి చేరాలని మరెన్నో పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు నారు



## ఆర్డిటి సంస్థకు ఎఫ్ సిఆర్ఏను పునరుద్ధరించాలి

**-ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రేగాటిపల్లి వరదరాజులు డిమాండ్**



**ధర్మవరం మేజర్ న్యూస్:** స్వచ్ఛంద సేవా సంస్థకు వెంటనే ఎఫ్ సి ఆర్ ఏ ను పునరుద్ధరించి అనంత కరువు జిల్లాను ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మిత్తి గొల్ల వరదరాజులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డిటి వ్యవస్థాపకులు అనంతపురం ఉమ్మడి జిల్లాల నిరుపేదల ఆశాజ్యోతి స్వర్గీయ డాక్టర్ ఫాదర్ ఫెర్రర్ , అన్నే ఫెరర్ , ఈ పుణ్య దంపతులకు ఏకైక కుమారుడు మంచో ఫెర్రర్ కల్పతరువుగా మారారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతంలో ఆసుపత్రులు ఏర్పాటుచేసి,,,ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా,,, అన్ని రకములైన వైద్య సేవలను చిన్నపిల్లలకు, మహిళలకు, ప్రత్యేకంగా గర్భిణీ స్త్రీలకు ఉచితంగా సేవలు అందిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆర్డిటికీ అన్ని విధాల సహకరించి పేదలకు వారు అందించే పథకాలన్నీ తిరిగి పునరుద్ధరించేలా కృషి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## టిడిపి సీనియర్ నాయకుడు ఎడమల శివయ్య మృతి

**నివాళులర్పించిన టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి**



**కూడేరు మేజర్ న్యూస్:** కూడేరు మండలానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఎడమల శివయ్య అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి శివయ్య మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు పరామర్శించాడు. ఈ కార్యక్రమంలో బాట వెంకటేశు,జయప్రకాష్ గౌడ్, బొమ్మయ్య, నారాయణస్వామి, శ్రీధర్ నాయుడు, గొల్ల వెంకటేష్, అంతే బీమా, రాయమ్మొల్ల వెంకటేష్,చిన్న ఈశ్వరయ్య, నీళ్ల శివ, కొడిమి మలోవులు, బలిజ శ్రీనివాసులు, గంటముక్కల రమేష్, బషీర్ భాష, మసూద్ వలి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం

**బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్..**



**కూడేరు మేజర్ న్యూస్:–** కూడేరు మండల పరిధిలోని ఇప్పేరు గ్రామం విలేఖరి మల్లికార్జున వివాహమునకు బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ కూడేరు శిరిడి సాయిబాబా దేవాలయమునందు ఆదివారం,వారి వివాహమునకు హాజరై నూతన వధూవరులైన పెండ్లి కుమారుడు మల్లికార్జున, పెండ్లి కుమార్తె గౌరమ్మను పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసి వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిషన్ మోర్చా మండల అధ్యక్షులు అరవకూరు మలోబులు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, సంజీవ నాయక్, రవి గంగన్న తదితరులు పాల్గొన్నారు..

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ జి శ్రీనివాస్ నాయుడును కలిసిన అపూస్మా నాయకులు

**అనంతపురం విద్య మేజర్ న్యూస్** అనంతపురం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ జి శ్రీనివాస్ నాయుడుని అపుస్మా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ పుల్లారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు నాయుడు, జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవిశంకర్ ప్రసాద్, రాష్ట్ర నాయకులు నాగరాజు, జిల్లా సలహాదారు మహమ్మద్ ఇక్బాల్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



# శాంతియుత ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటు

## - జాయింట్ యాక్షన్ కమిటీ తీవ్ర అసంతృప్తి



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : ప్రజాస్వామ్య శాంతియుత ప్రదర్శనలను పోలీస్ అధికారులు ఎలా అడ్డుకుంటారని యునైటెడ్ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ప్రశ్నించింది. వివరాల్లోకి వెళితే వక్ఫ్ సవరణ బిల్లు చట్టం సమంజసం కాదని ముస్లిం సమాజం ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు అనంతపురం యునైటెడ్ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ శాంతియుత మానవహార్ కార్యక్రమాన్ని డిఎస్పి అనుమతి నిరాకరించారు, ఈ సందర్భంగా స్థానిక శ్రీనేత్ర ఆసుపత్రి పై నున్న సమావేశ మందిరంలో ముస్లిం జే ఏ సి పెద్దలు అత్యవసరంగా నిర్వహించిన పత్రికా సమావేశంలో మాట్లాడారు. చేపట్టిన మానవహార కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జరిగే 15 నిమిషాల కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉగ్రవాద చర్యలకు పాల్పడిన వారికి మతం లేదని, గతంలో పుల్వామా సంఘటనలో కూడా 40 మంది సైనికులు చనిపోతే అప్పుడు ఇప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వం యొక్క భద్రత వైఫల్యంగానే భావించాలి తప్ప హిందూ ముస్లిం ఐక్యతకు భంగం కలిగించే విధంగా అంతర్గత సమగ్రతకు భంగం కలిగేలా ఆజ్యం పోయడం సమంజసం కాదని కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ విజ్ఞప్తి చేసింది.

నగర మేయర్ వసీం మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఉన్న సమానత్వ సూత్రాలకు, మైనారిటీలకు కల్పించినటువంటి హక్కులకు భిన్నంగా వక్ఫ్ సవరణలు చేయడం పట్ల ముస్లిం సమాజం తీవ్రమైన వ్యతిరేకతను ప్రదర్శిస్తుందని అందులో భాగంగా పట్టణంలో ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసన వ్యక్తం చేసేటువంటి రాజ్యాంగ హక్కును ఇవాళ పోలీసు అధికారుల ద్వారా ఆపడం అనేది సమంజసమైన చర్య కాదని శాంతియుతంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వహించేటువంటి నిరసనలను అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ మైనారిటీ రాష్ట్ర నాయకులు దాదా గాంధీ మాట్లాడుతూ అన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ కూడా లక్షలాది ఎకరాల భూములు ఉన్నాయని మరి వాటిని కూడా ఎన్నో అవకతవకలు జరిగాయని మరి వాటిని సవరించకుండా కేవలం ముస్లిం సమాజానికి ఉన్న ఆస్తులపై లక్ష్యంగా సవరణలు చేయడం పట్ల ప్రభుత్వం యొక్క దురుద్దేశం ముస్లిం సమాజానికి అర్థమవుతుందని ప్రజాస్వామ్యంగా నిర్వహించేటువంటి నిరసన కార్యక్రమాన్ని అనుమతి ఇచ్చి మళ్ళీ రద్దు చేయడం కరెక్ట్ కాదని అవసరమైతే జిల్లాలోని ఉన్నతాధికారులను కూడా కలిసి తగు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. అధికారులతో మాట్లాడి అనుమతి తీసుకుని తదుపరి ఉద్యమ కార్యాచరణను తెలియచేస్తామని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ జాఫర్ తెలిపారు. ఈ సమావేశంలో యునైటెడ్ ముస్లిం జే.ఏ.సి ఖాజా, భాషా, హాజీపీరా, రిజ్వాన్, సైఫుల్లా పాల్గొన్నారు.

# 10న కార్మిక సంఘాల జిల్లా సదస్సును జయప్రదం చేయండి



**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్ :** కార్మిక సమస్యలపై ఈనెల 10న నిర్వహించనున్న కార్మిక సంఘాల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, వైయస్ఆర్టియుసి జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, ఏఐఎఫ్టియూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాల సదస్సు కరపత్రాలను వారు ఆవిష్కరించారు. అనంతరం కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి మే 20 న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మె చేపట్టాయన్నారు.కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక హక్కులను పూర్తిగా హరించిందన్నారు.కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నా అమలు జరగడం లేదన్నారు.అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు,కేంద్రంలో 8 వ రాష్ట్రంలో 12 వ వేతన సంఘం ఏర్పాటు చేయాలన్నారు.కార్మిక చట్టాలను కొనసాగించి లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు.ప్రైవేటీకరణ విధానాలు నిలుపుదల చేసి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలన్నారు. సుప్రీం కోర్టు సూచన మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్ల పై జరుగు సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, సిఐటియు నగర కార్యదర్శి ముత్తూజ, వైయస్ఆర్టియుసి నగర అధ్యక్షులు ఖాజా,చేతివృత్తుల సమాఖ్య నాయకులు లింగమయ్య,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ,ఆటో యూనియన్ నగర అధ్యక్ష,కార్యదర్శులు దుర్గాప్రసాద్,కృష్ణానాయక్ పాల్గొన్నారు.

## షహీద్ టిప్పు సుల్తాన్ వర్ధంతి..




హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం పట్టణం లోని ఆజాద్ నగర్ సర్కిల్ లో హిందూ ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో ముస్లిం నగారా మరియు అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ అధ్యక్షతన ఫ్రీడమ్ ఫైటర్ షహీద్ టిప్పు సుల్తాన్ వర్ధంతి షహీదోన్ కో యాద్ కరో కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఉమర్ ఫారూఖ్ ఖాన్, ఎరుకల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎరుకల శంకర్, తూముకుంట పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు రవి, బహుజన సమాజ్ పార్టీ నాయకులు హరి, మాజీ ముతవల్లీ కలీమ్, వైసీపీ నాయకులు అమానుల్లా, కాంగ్రెస్ నాయకులు జమీల్, టిప్పు సుల్తాన్, రక్తదాన సంఘం షేక్ షబ్బీర్ తదితరులు హాజరై మాట్లాడుతూ మహనీయులు షహీద్ టిప్పు సుల్తాన్ మాతృ భూమి కోసం రాజీ లేని పోరాటం చేసి ప్రాణ త్యాగం చేశారని హిందూ ముస్లిం సోదరులకు రెండు కళ్ళు గా భావించారని, శృంగేరి పీఠాన్ని మరాఠాలు ధ్వంసం చేస్తే పునర్నిర్మించారని, ఉదయం ఆయన ఇంటినుండి బయటకు వస్తే ఓ చెవిలో రంగ నాథుని గుడి గంటలు, ఓ చెవిలో అల్లాహు అక్బర్ అనే శబ్దం చెవిలో వినబడేది. వందేళ్ల నక్క బతుకు కన్న ఒక్కరోజు సింహం బతుకు బతికితే చాలని టిప్పు సుల్తాన్ అనేవారు టిప్పు సుల్తాన్ ఆశయాలు వర్ధిల్లాలి, షహీద్ టిప్పు సుల్తాన్ జోహార్, షహీద్ టిప్పు సుల్తాన్ అమర్ హై అనే నినాదాలు చేస్తూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అతీఖుర్రహమాన్, ఆర్బాజ్ అబ్దురహమాన్ టైలర్ యూనియన్ జబీ, కాంగ్రెస్ నాయకులు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెస్ రాజుకు జన్మదిన శుభాకాంక్షలు



శింగనమల,మేజర్ న్యూస్ : మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ ) బోర్డు సభ్యులు ఎమ్మెస్ రాజు కు అనంతపురం తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా దేగల మాట్లాడుతూ ఎమ్మెస్ రాజు నిండు నూరేండ్లు చల్లగా వుండా లని, ఆయన మరిన్ని ఉన్నతమైన పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు. ఈకార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు బండ మీదపల్లి చంద్రాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత ఖత్నా

పామిడి. మేజర్ న్యూస్ : పట్టణంలోని షాది ఖానా నందు ఉచిత ఖాతానా హమారా ఇస్లాం డెవలప్మెంట్ కమిటీ, అభయ కిడ్నీ కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించారు. వైద్యులు డాక్టర్ నారాయణస్వామి ఎం.డి డాక్టర్ మునవర్ రాజా ఎం.ఎస్ జనరల్ సర్జన్ డాక్టర్ ఈశ్వర్ కంటి వైద్య నిపుణులు, డాక్టర్ మైమున్నీసా గైనకాలజిస్ట్ డాక్టర్ సాయి, జాయింట్ ఆర్థో మెట్రిస్ట్ రోషన్ రేడియాలజీ డిపార్ట్మెంట్ వారు శిబిరానికి వచ్చిన దాదాపు 50 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి మందులను అలాగే దుస్తులు మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన అమరా ఇస్లాం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యు.జిలాన్, ఉపాధ్యక్షుడు కే.సాదక్ వలి, కార్యదర్శి డి.ఖాజా, కోశాధికారి టి. అబ్దుల్, సభ్యులు టీ.దాదా ఖలందర్, కే.మైను .నజీర్. ఇంతియాజ్ . మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను గుర్తించి తగిన సేవలు అందించాలన్న సదుద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



నల్లమాడ, మేజర్న్యూస్ : నల్లమాడ గ్రామానికి చెందిన ఇరువురు తెలుగుదేశం కుటుంబ సభ్యులు మృతి చెందడంతో విషయం తెలుసుకొని ఆదివారం ఆ కుటుంబాలను పరామర్శించి వారికి ఆర్థిక సాయం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అందజేయడం జరిగింది.ఆ కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## శక్తి యాప్పై విస్తృతంగా అవగాహన

### - ఆపద సమయాలలో మహిళలకు ఉపయోగపడే శక్తి యాప్ పట్ల, శక్తి బృందాలు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు



పుట్టపర్తి క్రైమ్ మేజర్ న్యూస్: మహిళలు/అమ్మాయిల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి అమల్లోకి తీసుకొచ్చిన శక్తి యాప్ పట్ల జిల్లాలో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ జిల్లాలోని పోలీసు అధికారులు, శక్తి టీమ్స్ కు ఆదేశాలు ఇస్తున్నారు. ప్రతీ మహిళ తమ ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం పొందేలా చైతన్యం చేయాలన్నారు ఈ నేపథ్యంలో ఆదివారం మహిళా పి.ఎస్ డిఎస్పి ఆదినారాయణ పర్యవేక్షణలో జిల్లాలో గృహిణీలు, ఉద్యోగినులు, విద్యార్థినిలు, ఇలా వివిధ వర్గాల మహిళలు/అమ్మాయిలకు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేయిస్తూ వీటి ఉపయోగాలు సేవలు తెలియజేశారు. మహిళలకు శక్తి టీమ్ ఎస్ ఓ ఎస్ యాప్ ఉపయోగాలు,గుడ్ టచ్ - బ్యాడ్ టచ్,బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ క్రైమ్, ఫోక్సో ,సామాజిక మాధ్యమాల వినియోగం, అత్యవసర సేవలు - హెల్ప్ లైన్ నెంబర్లు మరియు ఇతర మహిళా సంబంధిత నేరాలపై విద్యార్థినలకు, మహిళలకు స్పష్టమైన అవగాహన కల్పించారు.

## కమ్మేస్తున్న కంప చెట్లు.. ప్రమాదపు అంచుల్లో ప్రజలు..



మడకశిర రూరల్ మేజర్ న్యూస్:మడకశిర నుండి హిందూపురం పోవు ప్రధాన రహదారి నుండి ఎల్లోటి మరియు ఇతర గ్రామాలకు పోవు దారి మొత్తాన్ని కంపచెట్లు పెరిగి రోడ్డును కమ్మేస్తున్నాయి ఈ దారి గుండా పోయే ద్విచక్ర వాహనాలు,ఆటోలు వాహనదారులకు మరియు పొలాలకు ద్విచక్ర వాహనాల ద్వారా వెళ్లే రైతులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉండి ప్రమాదాలకు గురి చేస్తున్న కంప చెట్లను తొలగించాలని ఆ రహదారి మీదుగా ప్రయాణించే పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



## 20న జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

కదిరి, మేజర్ న్యూస్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. లేబర్ కోడ్స్ బిల్లులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు పిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణంలోని సిఐటియు కార్యాల యంలో విలేకరుల సమావేశంలో ఓబులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలు సవరించి నాలుగు లేబర్ కోడ్స్ బిల్లులు తీసుకొచ్చి కార్మికుల హక్కులను హరించిం దన్నారు. కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకి దోచిపెట్టడానికే ఈ చట్టాలను సవరిం చిందన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలు అయితే కార్మికులకు సంఘం పెట్టుకొని హక్కు కూడా లేకుండా పోతుందన్నారు. ఒకవైపు దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగి ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందన్నారు. మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను పెట్టుబడుదారులకు ప్రయోజనం కోసం సవరించడం దారుణం అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న చేపట్టిన సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు జి.ఎల్ నరసింహులు, సాంబశివ, జగన్, రామ్మోహన్, ముస్తాక్, బాబ్జాన్, ఉదయ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మడకశిరలో బిజెపి నూతన అధ్యక్షులు కార్యదర్శుల ఎంపిక..



మడకశిర మేజర్ న్యూస్: సత్యసాయి జిల్లా మడకశిర పట్టణంలో సరస్వతీ విద్యా మందిరం ఆవరణంలో ఆదివారం రోజు నూతన బిజెపి అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగినది. ఈ సందర్భంగా బిజెపి సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్, హిందూపురం ప్రధాన కార్యదర్శి అమరేంద్ర, ముఖ్య అతిథిగా విచ్చేసి..సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం క్రియాశీల సభ్యులు నాగభూషణం,ధర్మవరం సూరి ఆధ్వర్యంలో మడకశిర పట్టణ బిజెపి పార్టీ నూతన అధ్యక్షుడిగా జయరామ్ గౌడ ప్రధాన కార్యదర్శులుగా రాము ధనుంజయ్ లను ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో అరవింద్ అనంత్ కాంతరాజు, కమలాకర్, హరి, నటరాజ్, విద్యా, దివ్య, అనిల్, సాయి, కిరణ్, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థలో అసంబద్ధ విధానాలను ప్రభుత్వం విడనాడాలి..

### ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, సిరాజుద్దీన్



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : విద్యావ్యవస్థలో అసంబద్ధ విధానాలు వ్యతిరేకంగా ఈనెల 5వ తేదీన పాత తాలూకా ఆఫీసుల వద్ద 9న అనంతపురం జిల్లా కలెక్టరేట్ వద్ద 14 న విజయవాడలో రాష్ట్రస్థాయిలో చేపట్టే ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లాలోని జిల్లా నాయకులకు మండల నాయకులకు కార్యకర్తలకు, ఉపాధ్యాయులకు జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధానమైన 11 సమస్యలను పరిష్కరించే వరకు తమ ఆపేది లేదని సిరాజుద్దీన్ స్పష్టం చేశారు.

## పాత పింఛను విధానం కోరుతూ పోస్ట్ కార్డు ఉద్యమం



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : కేంద్ర ప్రభుత్వ మెమో57 ప్రకారం పాత ఫించను విధానం అమలు చేయాలని 2003 డిఎస్సీ రాష్ట్ర ఫోరం కన్వీనర్ మధు ప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన తపాలా కార్యాలయంలో పాత ఫించను విధానం అమలు కోరుతూ పోస్ట్ కార్డులు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,భాజపా రాష్ట్ర అధ్యక్షులు కు తపాలా కార్డులు పంపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో సిపిఎస్ అమలైన తేదీ 2004 సెప్టెంబర్ ఒకటి కంటే ముందు విడుదలైన నోటిఫికేషన్స్ ద్వారా తాము నియమితులమయ్యామని రాష్ట్రవ్యాప్తంగా 11 వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయులు కేంద్రమేమో 57 ప్రకారం పాత ఫించనుకు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్లు ఎం. ఎం. వి. ప్రసాద్, నాగభూషణ, సాయినాథ్ రెడ్డి, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై శ్రద్ధేదీ?

పరిగి మేజర్ న్యూస్: మండల పరిధిలోని గార్మెంట్స్, పైడేటి సర్కిల్ డ్రైనేజీలో చెత్త వ్యర్థాలతో నిండిపోయింది. కూడలిలోని దుకాణదారులు వ్యర్థాలను తీసు కొచ్చి రోడ్డు పక్కనే వేశారు. పక్కనే గార్మెంట్స్ నిత్యం వేల మంది రాకపోకలు సాగించే రహదారి పక్కన ఇలా చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఇక్కడికి వచ్చే సరికి దుర్గంధం వెదజల్లుతోంది. రోజువారీగా చిరు వ్యాపారస్తులు బయటా వేసే చెత్తతోనే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన పీల్చలేక ఎక్కడికక్కడ కార్మికులు ప్లాస్టిక్ నిప్పు పెట్టడంతో ఊపిరి తీసుకోవడానికి అల్లాడిపోతున్నారు. దానికితోడు అంటువ్యాధులు, అలర్జీలు వస్తున్నాయి. రోజూ ఎంతో కొంత మురుగు కంపు, చెత్త కాల్చిన వాసనలు పీల్చడంతో ఊపిరితిత్తుల సమస్యలు చుట్టుముడుతున్నాయి.

**గుంత తవ్వారు వదిలేసారు కనిపించని హెచ్చరిక బోర్డు**

మండల పరిధిలోని గ్రంథాలయం కార్యాలయం దగ్గర తాగునీటి పైపులైను పనుల్లో భాగంగా ఇటీవల గుంతను తవ్వి పూడ్చకుండా వదిలేశారు. ఆధార్ కార్డు మార్పులు చేర్పుల కొరకు విద్యార్థులు తల్లిదండ్రులు గ్రంథాలయంలోకి వచ్చే ప్రజలకు నిత్యం వాహన చోదకులతో రద్దీగా ఉండే ఈ మార్గంలో పక్కనే ఉన్న ప్రతిమ చికిత్స కేంద్రాలకు వచ్చే రోగులకు ఈ గుంతలో పడే అవకాశం లేకపోలేదు ప్రమాదకరంగా ఉన్న గుంతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. హెచ్చరిక బోర్డు కూడా నియమించకపోవడం పట్ల అధికారుల పనితీరు ఇట్టే కనబడుతుంది. ఫోటోలు తీసి అప్లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. వేసవిలో రంగురంగుల కలర్ జ్యూస్ అంటూ ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్న వ్యాపారస్తులు పరిగి సర్కిల్ కెనరా బ్యాంకు పక్కన పైడేటి సర్కల్లో వెలసిన సూపర్ కూల్ డ్రింక్ షాప్ రకరకాల రంగులు కలిపి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ



ఎటువంటి అనుమతులు లేకుండా అధిక ధరలకు వేసవికాలంలో ప్రయాణించే ఎటువంటి ప్రజలకు చిన్న పిల్లలకు చల్లగా ఉన్న పండు మిక్సర్ ఆరెంజ్ బాదంపాలు రకరకాల జ్యూస్ లో అప్పటికప్పుడే తయారు చేసి ఇవ్వడం అధిక లాభాలు పొందుతూ నాణ్యతలేని పండ్లు తక్కువ ధరకు తీసుకురావడం వాటిని అలాగే వేసి ప్రజలకు జ్యూస్ రూపంలో అందిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న వీరిపై పర్యవేక్షించాల్సిన అధికారులు ఉన్నారో లేరో అని అనుమానం కలుగుతుంది . అదేవిధంగా ఆఫ్ లీటర్ వాటర్ బాటిల్స్ (మినరల్ వాటర్) ఎటువంటి అనుమతులు లేకుండా మండలంలోని దుకాణాల్లో దర్శనమిస్తున్నాయి ఆ నీటిని తగిన వెంటనే ఎక్కువ వాసన వస్తున్నాయి. ఆ వాటర్ బాటిల్ నూ గూగుల్లో వెతికిన వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు కానీ క్యూఆర్ కోడ్ కనిపించడం లేదు అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల మండల హెడ్ క్వార్టర్స్ లో ఎన్నో రకాలుగా ప్రజలను నిలువ దోపిడీ చేస్తున్నారు వ్యాపారస్తులను కట్టడి చేయడానికి అధికారులలో చలనం లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీని కలిసిన ఉపాధ్యాయ సంఘం నాయకులు

అనంతపురం విద్య మేజర్ న్యూస్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డా. గాదె శ్రీనివాసులు నాయుడు అనంతపురం పర్యటన భాగంగా రోడ్ అండ్ బిల్డింగ్స్ లో ఉపాధ్యాయ సంఘం నాయకులు పలు కంశాలపై ప్రాతినిధ్యం ఇచ్చారు. ఉపాధ్యాయ బదిలీలు ఎవ్వరికి ఎలాంటి వివాదలకు లేకుండా త్వరగా చేపట్టాలని, ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి తగ్గించాలని, వేసవి సెలవుల్లో సమ్మర్ కోచింగ్ నిర్వహించే ఉపాధ్యాయులకు ఈ ఎల్ ను ఇవ్వాలని, డీఈవో పూల్ లో వున్నా ఎల్ పి లకు ప్రమోషన్ ఇవ్వాలని, ప్రమోషన్ లను త్వరగా చేపట్టాలని కోరుతున్నాం. ఉర్దూ పాఠశాలలో తెలుగు పోస్ట్ కొనసాగించాలని, ఉపాధ్యాయ బదిలీలు ఎలాంటి కోర్ట్ వివాదాలకు చేపట్టాలని కోరారు.. కార్యక్రమం లో అనంతపురం జిల్లా అధ్యక్షులు టి. పురుషోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. తిమ్మారెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకులు ఎన్. విష్ణువర్ధన్ రెడ్డి, సత్యసాయి జిల్లా పి ఆర్ టి యు



ఏపీ ప్రధాన కార్యదర్శి టి. చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదరి ఏ. కేశవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వై. సి. ప్రసాదరెడ్డి, సత్యసాయి జిల్లా రాష్ట్ర నాయకులు బి. చితంబర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు ఎం వి శివారెడ్డి, జిల్లా నాయకులు బాబయ్య, శ్రీరాములు, చంద్రశేఖర్, జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.